## విలేకరులు కావలెను

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 | సంచిక :93 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | ఆదివారం 23 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


## న్యాయసేతు అనేది ఒక వారధి

- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- వేగవంతమైన ఆర్థిక పురోగతికి పటిష్ఠమైన న్యాయ వ్యవస్థలే వెన్నెముక
- ఢిల్లీలో జరిగిన 11వ బ్రిక్స్ ప్లస్ లీగల్ ఫోరంలో పాల్గొన్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- అక్కడ న్యాయనామిక్స్, న్యాయ సేతు అనే పదాలను పరిచయం చేసిన ప్రధాన న్యాయమూర్తి



## విమాన ప్రయాణికులకు బిగ్ రిలీఫ్

- ఇకపై 'ఈ-బోర్డింగ్ పాస్' ఉంటే చాలు!
- ఎయిర్‌పోర్టుల వద్ద బోర్డింగ్ పాస్‌పై కేంద్రం కీలక నిర్ణయం
- అంతర్జాతీయ విమాన ప్రయాణికులు ఇకపై ఫిజికల్ బోర్డింగ్ పాస్‌ను తీసుకురావాల్సిన అవసరం లేదని వెల్లడి





## వందేమాతరంపై దేశవ్యాప్తంగా కార్యక్రమాలు

- కాంగ్రెస్ నిర్ణయాన్ని ఖండిస్తూ బీజేపీ తీర్మానం
- జాతీయ గేయం చరిత్ర, వారసత్వంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తామని పార్టీ వెల్లడి
- వందేమాతరం రెండు చరణాలే పాడుతామంటూ కాంగ్రెస్ చేసిన ప్రకటనను ఖండిస్తూ మరో తీర్మానానికి పార్టీ ఆమోదం



## ఈ నెల 31న వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభిస్తాం

- వెలిగొండ నిర్వాసితుల మూడో విడతగా 2,027 కుటుంబాలకు రూ.250 కోట్ల పరిహారం చెల్లింపు
- 3 దశాబ్దాల కల నెరవేరుతున్నందుకు నిర్వాసితులు హర్షం

**అమరావతి**

ఈ నెల 31న వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించి జాతికి అంకితం చేస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా వెలిగొండ టన్నెళ్ల నుంచి 10.5 టీఎంసీల కృష్ణా జలాలను నల్లమల సాగర్‌కు విడుదల చేస్తారని చెప్పారు. వెలిగొండ నిర్వాసితులకు మూడో విడతలో భాగంగా 2,027 కుటుంబాలకు రూ.250 కోట్ల పరిహారాన్ని క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు అందజేశారు. అనంతరం మంత్రి నిమ్మల మీడియాతో మాట్లాడారు. వెలిగొండ అన్ని పనులు పూర్తి చేసి వివరాలు 2లో..

# స్వచ్ఛత మనందరి బాధ్యత

- త్వరలోనే అనకాపల్లి, విశాఖకు గోదావరి నీళ్లు తెస్తాం: సీఎం చంద్రబాబు
- అనకాపల్లి జిల్లాలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు
- అభివృద్ధి అంటే పరిశ్రమలు, పెట్టుబడులు, కంపెనీలే కాదు స్వచ్ఛమైన ప్రాంతాలన్న ముఖ్యమంత్రి
- స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు



**అమరావతి**

విశాఖకు మించి అనకాపల్లికి పెట్టుబడులు వస్తున్నాయని సీఎం చంద్రబాబు అన్నారు. స్టీల్ సిటీ నిర్మాణం కాబోతుందని, భవిష్యత్తులో నాలెడ్జ్ ఎకానమీకి కేంద్రంగా అనకాపల్లి మారబోతుందన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం ఎ.కోడూరులో పర్యటించిన సీఎం ప్రజావేదికలో మాట్లాడారు. ప్రతి గ్రామం జీరో వేస్ట్ పంచాయతీగా తయారు కావాలన్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్సీపీ పాలనలో రాష్ట్రమంతా చెత్తమయం చేశారని ప్రస్తుతం ఆ చెత్తను తొలగించే పనులు ఊపందుకున్నాయన్నారు. చెత్త నుంచి కంపోస్ట్, కరెంట్, గ్యాస్ ఉత్పత్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలు 2లో..



## న్యాయమూర్తులు దేవుళ్లు కాదు

- ప్రతి తీర్పు సరైనదిగా ఉండకపోవచ్చు
- జస్టిస్ సంజయ్ కరోల్
- వీడ్కోలు ప్రసంగంలో జస్టిస్ సంజయ్ కరోల్ కీలక వ్యాఖ్యలు
- న్యాయమూర్తులు దేవుళ్లు కాదన్న జస్టిస్ సంజయ్
- చట్టాన్ని మాత్రమే కాదని, న్యాయాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలన్న జస్టిస్ కరోల్

## 'ఇది ఎలాంటి 'ఆత్మనిర్భర్ భారత్'

- పండగ ముందు ప్రజలపై భారం'
- కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే ఫైర్
- చక్కెర ధరలను పెంపుపై ప్రభుత్వంపై మండిపడ్డ కాంగ్రెస్
- పండుగల సీజన్‌కు ముందే సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని ఆరోపణ





# లోకల్ పోల్స్ కోసం జనసేన ప్లాన్

- స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కీలక వ్యాఖ్యలు
- 2024 సార్వత్రిక ఎన్నికల్లో 21 అసెంబ్లీ స్థానాలకే పరిమితమైన వ్యూహం కేవలం ఆ ఎన్నికలకే వర్తిస్తుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం అదే ఫార్ములా ఉండబోదు
- ప్రాంతాలవారీ రాజకీయ, సామాజిక సమీకరణాల ఆధారంగా జనసేన వ్యూహం స్వతంత్రంగా, ప్రభావశీలంగా ఉంటుందని స్పష్టం
- ఐదేళ్ల పాటు పార్టీ కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన జనసైనికులు, వీర మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడేలా రాబోయే స్థానిక ఎన్నికల్లో అడుగులు వేయాలని పవన్ పిలుపు

**విజయవాడ**

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పార్టీ నాయకత్వానికి, ఎమ్మెల్యేలకు అత్యంత స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన జనసేన లెజిస్లేటివ్ పార్టీ సమావేశంలో పాల్గొన్న ఆయన, స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కీలక వ్యాఖ్యలు చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో 21 అసెంబ్లీ స్థానాలకే పరిమితమైన వ్యూహం కేవలం ఆ ఎన్నికలకే వర్తిస్తుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం అదే ఫార్ములా ఉండబోదని తేల్చిచెప్పారు. ప్రాంతాలవారీ రాజకీయ, సామాజిక సమీకరణాల ఆధారంగా జనసేన వ్యూహం స్వతంత్రంగా, ప్రభావశీలంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఐదేళ్ల పాటు పార్టీ కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన జనసైనికులు, వీర మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడేలా రాబోయే స్థానిక ఎన్నికల్లో అడుగులు వేయాలని పవన్ పిలుపునిచ్చారు. 2021 స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్సీపీ అరాచకాలను ఎదిరించి జనసేన కార్యకర్తలు ధైర్యంగా నిలబడ్డ విషయాన్ని, అలాగే 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి చారిత్రాత్మక విజయానికి క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు చేసిన అసమాన కృషిని ఈ సందర్భంగా కొనియాడారు. పార్టీ కోసం నిలబడిన ప్రతి కార్యకర్త రాజకీయ బలోపేతమే లక్ష్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేనకు మెరుగైన అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక ఎన్నికల విధివిధానాల రూపకల్పన కోసం 9 నుంచి 11 మంది ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు అధినేత ప్రకటించారు. నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసి, జనసేన పోటీ చేయడానికి తగిన వివరాలు 2లో..

## సమాజంలో సమూల మార్పులు విద్యతోనే సాధ్యం

- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల క్లస్టర్ సమావేశంలో పాల్గొన్న మంత్రి లోకేశ్
- మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనా పద్ధతులను మార్చుకోవాలని సూచన
- ప్రతీ ఉపాధ్యాయుడు ఏఐపై అవగాహన పెంచుకోవాలని వ్యాఖ్య



**అమరావతి**

సమాజంలో మనం కోరుకున్న సమూల మార్పులు ఒక్క విద్యతోనే సాధ్యమవుతాయని విద్యాశాఖ మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. అందుకే తాను కీలకమైన విద్యాశాఖ బాధ్యతలు స్వీకరించానని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనా పద్ధతులను మార్చుకోవాలన్నారు. విజయనగరం జిల్లా దాసన్నపేటలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న కీలక నిర్ణయాలను లోకేశ్? వివరించారు. ప్రతీ ఉపాధ్యాయుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్? పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. తాను కూడా విద్యాశాఖ సమర్థ నిర్వహణకు ఏఐపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకుంటున్నట్లు తెలిపారు. - వివరాలు 2లో..

# అసెంబ్లీ బహిష్కరణ

# మైలేజ్.. డ్యామేజా...

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీసుకున్న తాజా నిర్ణయం మరోసారి చర్చకు దారితీసింది. రాష్ట్ర అసెంబ్లీ వర్షాకాల సమావేశాలకు పార్టీ ఎమ్మెల్యేలు హాజరు కాకూడదని నిర్ణయించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల తర్వాత సభలో తమకు దక్కాల్సిన ప్రతిపక్ష హోదా విషయంలో న్యాయం జరగలేదన్నది వైసీపీ ప్రధాన వాదనగా ఉంది. ఈ అంశాన్నే కేంద్రంగా చేసుకుని అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండాలని పార్టీ నిర్ణయించింది.2024 ఎన్నికల్లో వైసీపీకి 11 అసెంబ్లీ స్థానాలు మాత్రమే దక్కాయి. కూటమి పార్టీలైన తెలుగుదేశం పార్టీ , జనసేన , బీజేపీ కలిసి భారీ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. దీంతో శాసనసభలో వైసీపీ సంఖ్యాబలం గణనీయంగా తగ్గిపోయింది. ఎన్నికల ఫలితాల తర్వాత నుంచే ప్రతిపక్ష హోదా అంశం ఆ పార్టీ రాజకీయ చర్చలో కీలకంగా మారింది.వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సభలో తమ పార్టీకి తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని పలుమార్లు ఆరోపించారు. మరోవైపు ప్రభుత్వం, కూటమి నేతలు మాత్రం ప్రతిపక్ష హోదాకు సంబంధించిన నిబంధనలు, సభలో పార్టీ బలాన్ని ప్రస్తావిస్తూ వైసీపీ వాదనను అంగీకరించడం లేదు. దీంతో రెండు వైపులా రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి.అయితే అసెంబ్లీకి వెళ్లకుండా ఉండటం వల్ల వైసీపీకి రాజకీయంగా ఎంత మేరకు ప్రయోజనం కలుగుతుందన్నది ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది. ప్రజల సమస్యలను నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు శాసనసభ ఒక ముఖ్యమైన వేదిక. నిరుద్యోగం, రైతుల సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ధరల పెరుగుదల, అభివృద్ధి కార్యక్రమాలు వంటి అంశాలపై అధికార పక్షాన్ని ప్రశ్నించే అవకాశం ప్రతిపక్ష సభ్యులకు ఉంటుంది. అలాంటి అవకాశాన్ని స్వయంగా వదులుకోవడం వల్ల పార్టీకి నష్టం జరిగే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి.మరోవైపు వైసీపీ తన రాజకీయ పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. అసెంబ్లీకి గైర్హాజరైనప్పటికీ పార్టీ నాయకులు, కార్యకర్తల ద్వారా ప్రభుత్వ నిర్ణయాలను విమర్శించడం, ప్రజా సమస్యలను ప్రస్తావించడం కొనసాగించవచ్చు. సోషల్ మీడియా, బహిరంగ కార్యక్రమాలు, పార్టీ సమావేశాలను ఇందుకు ఉపయోగించుకునే అవకాశం ఉందిశాసనమండలిలో మాత్రం వైసీపీకి కొంత బలం ఉండటంతో అక్కడి వేదికను ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ఉపయోగించుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఒకవైపు అసెంబ్లీకి దూరంగా ఉంటూ, మరోవైపు మండలిలో ప్రభుత్వాన్ని నిలదీయడం అనే ద్వంద్వ వ్యూహం ఆసక్తిని కలిగిస్తోంది.ఇక వరుసగా సభకు గైర్హాజరైతే సభ్యుల హాజరుకు సంబంధించిన రాజ్యాంగ నిబంధనలు కూడా ప్రస్తావనకు వస్తున్నాయి. అయితే గైర్హాజరుపై అనుమతులు, సభా విధానాలు వంటి అంశాలు కూడా ఇందులో కీలకంగా ఉంటాయి. కాబట్టి కేవలం గైర్హాజరు ఆధారంగా సభ్యత్వంపై తక్షణ నిర్ణయం వస్తుందని భావించడం సరికాదు.మొత్తానికి వైసీపీ అసెంబ్లీ బహిష్కరణ నిర్ణయం ఆ పార్టీ రాజకీయ వ్యూహానికి పరీక్షగా మారింది. ప్రతిపక్ష హోదా అంశాన్ని ప్రజల్లోకి ఎంత బలంగా తీసుకెళ్తుంది, అసెంబ్లీకి దూరంగా ఉండటం వల్ల రాజకీయంగా లాభమా నష్టమా అన్నది కాలమే తేల్చనుంది. ప్రజా సమస్యలపై పోరాటానికి సభా వేదికను ఎంచుకుంటుందా, లేక బయట నుంచే ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తుందా



అనేది రాబోయే రోజుల్లో ఆసక్తికరంగా మారనుంది.

**వైసీపీ రికార్డు**

చట్ట సభలే ప్రజాస్వామ్య వేదికలు. అక్కడ అన్ని పక్షాలు కలిసి ప్రజా సమస్యల మీద చర్చిస్తాయి. అలాంటి వేదికలను బహిష్కరించడం అన్నది తొలి తరంలో జరిగేది కాదు, అసలు వాకౌట్లు కూడా అప్పట్లో తక్కువగా ఉండేవి. అయితే రాను రానూ రాజకీయం పెరిగి సభలకే డుమ్మా కొడుతున్నారు. ఇక దేశంలో శాసనసభ మొత్తాన్ని లేదా సమావేశాలను ఒక నిర్దిష్ట రాజకీయ పార్టీ పూర్తిగా బహిష్కరించడం అనేది ఎక్కడా లేదని అంటున్నారు. అదే సమయంలో ఇది రాష్ట్రాల వారీగా అక్కడి రాజకీయ పరిస్థితులు అధికార ప్రతిపక్షాల మధ్య వివాదాలు లేదా సభలో తమకు సముచిత గౌరవం దక్కలేదనే కారణాలపై ఈ బహిష్కరణలు ఆధారపడి ఉంటాయి. మరో వైపు చూస్తే భారతదేశంలో అసెంబ్లీలను బహిష్కరించే పార్టీలు ఉన్నా పాక్షికంగా పరిమితంగా జరిగిన సందర్భాలు ఉన్నాయని అంటున్నారు. కొన్ని సందర్భాలలో ప్రతిపక్ష పార్టీలు నిరసనగా సభలకు దూరంగా ఉంటూ వచ్చిన నేపథ్యం ఉంది. అయితే ఒక ప్రధాన ప్రతిపక్ష పార్టీ మొత్తం అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండటాన్ని ప్రజాస్వామ్య వ్యవస్థలో బాధ్యతారాహిత్యంగా అధికార పార్టీలు విమర్శిస్తుంటాయి. సభలో చర్చల ద్వారానే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, బహిష్కరణలు సరైనవి కాదని రాజకీయ విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతుంటారు. ఏపీలో చూస్తే మూడు సందర్భాలలో ముగ్గురు నాయకులు అసెంబ్లీ బహిష్కరణ పిలుపు ఇచ్చారు. వారే ఎన్టీఆర్, జగన్ చంద్రబాబుగా చెప్పాలి మూడున్నర దశాబ్దాల క్రితం చూస్తే ఎన్టీఆర్ 1989లో విపక్షంలో ఉన్నారు. అయితే ఆయన పార్టీకి చెందిన వారు అంతా సభకు హాజరయ్యారు. అప్పట్లో ఉప నాయకులుగా చంద్రబాబు ఇతర నేతలు కలసి టీడీపీని అసెంబ్లీలో నడిపించారు. ఇక జగన్ అయితే 2017లో అసెంబ్లీకి రావడం లేదని ఒక దండం పెట్టి మరీ జనంలోకి పాదయాత్ర కోసం వెళ్ళారు. అయితే జగన్ అప్పటికి మూడేళ్ళ పాటు అసెంబ్లీకి హాజరయ్యేవారు. చంద్రబాబు విషయం తీసుకుంటే ఆయన 2021లో వైసీపీ ప్రభుత్వ హయాంలో సభలో తనకు అవమానం జరిగిందంటూ చంద్రబాబు అసెంబ్లీని బహిష్కరించి మళ్లీ అధికారంలోకి వస్తేనే అసెంబ్లీలో అడుగుపెడతానని శపథం చేసి వెలువడిన సందర్భాన్ని రాజకీయ ప్రత్యర్థులు ప్రస్తావిస్తుంటారు ఇక అసెంబ్లీలను బహిష్కరించడం అన్న దానికి బీజం తమిళనాడులో జయలలిత హయాంలో పడింది అని చెప్పాల్సి ఉంటుంది. 1989 మార్చి 25న తమిళనాడు అసెంబ్లీలో జరిగిన ఘోర అవమానం కారణంగా ప్రతిపక్ష నేతగా ఉన్న జయలలిత సభను బహిష్కరించారు. డీఎంకే సభ్యుల దాడిలో అవమానానికి గురైన ఆమెమళ్ళీ ముఖ్యమంత్రిగా అడుగుపెడతాను అని భీష్మ ప్రతిజ్ఞ చేసి సభను వీడారు. ఈ సంఘటన ఆమె రాజకీయ జీవితంలో ఒక కీలక మలుపుగా నిలిచింది. ప్రజల్లో ఆమెకు సానుభూతి పెరిగింది. సరిగ్గా రెండేళ్ల తర్వాత 1991 ఎన్నికల్లో అఖండ విజయం సాధించి, తాను అనుకున్నట్టుగానే తమిళనాడు తొలి మహిళా పూర్తికాల ముఖ్యమంత్రిగా ఘనంగా అసెంబ్లీలో అడుగుపెట్టారు అయితే వైసీపీ మాత్రం 2024లో కొత్త అసెంబ్లీ ఏర్పాటు అయ్యాక అసెంబ్లీకి వెళ్ళడం మానుకుంది. ఆ పార్టీ తనకు 11 సీట్లు వచ్చినా ప్రధాన ప్రతిపక్ష పాత్ర కోరుతోంది. అయితే రూల్స్ మాత్రం అందుకు ఒప్పుకోవని స్పీకర్ ఆఫీసు చెబుతోంది. ఈ నేపథ్యంలో అసెంబ్లీకి వైసీపీ దూరంగా ఉంటోంది. ఇప్పటికి 26 నెలలు గడచిపోయినా వైసీపీ అసెంబ్లీ వైపు చూడడం లేదు, దీని మీద ముఖ్యమంత్రి చంద్రబాబు తాజాగా విమర్శలు చేశారు. ప్రజాస్వామ్యంలో అసెంబ్లీని ప్రతిపక్షాలు బహిష్కరించడం సరికాదని అన్నారు. ప్రజా సమస్యలపై సభలోనే తేల్చుకోవాలని ఆయన అన్నారు. వైసీపీ తీరును తప్పుపడుతూ తన రాజకీయ జీవితం మొత్తంలో ఇలాంటివి చూడలేదని అన్నారు. దేశంలో కూడా ఈ రకమైన పరిణామాలు ఎక్కడైనా జరిగాయో లేవో కానీ ఈ విషయంలో వైసీపీది కొత్త రికార్డు అని ప్రత్యర్థులు విమర్శిస్తున్నారు.

## లోకల్ ఎన్నికలు కొంపముంచాతాయా? ఏంటి?

**నెల్లూరు :** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకంతో పాటు ఎంతో సవాల్ గా మారనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కూటమి ప్రభుత్వం, ఇప్పుడు గ్రామం నుంచి మున్సిపల్ స్థాయి వరకు పార్టీ యంత్రాగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు కావస్తుంది. కార్యకర్తల్లో ఎన్నికలకు ముందు ఉత్సాహం లేదు. పదవులు లేవు. వారికి సరైన పనులు దక్కడం లేదు. ఇప్పటికీ అనేక నియోజకవర్గాల్లో వైసీపీ నేతలదే పెత్తనమని కార్యకర్తల నుంచి ద్వితీయ శ్రేణి నేతల వరకూ భావిస్తున్నారు. వీరు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంత మేరకు కమిట్ మెంట్ తో పనిచేస్తారన్నది మాత్రం లోలోపల పార్టీ నేతలకు కూడా సందేహంగానే కనిపిస్తుంది.. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాకముందు ఒకలా... వచ్చిన తర్వాత మరొకలా వ్యవహరిస్తుంది. గత సాధారణ ఎన్నికల్లో ప్రాణాలకు తెగించి పోలింగ్ కేంద్రాల వద్ద కార్యకర్తలు పోరాడారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా పార్టీ అగ్రనాయకత్వం హెచ్చరికలు చేస్తున్నా అత్యధిక సంఖ్యలో ఉన్న టీడీపీ శాసనసభ్యులు తమకు ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చే వారికే పనులు కట్టబెడుతున్నారు కానీ, పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తల కష్టాన్ని మాత్రం గుర్తించడం లేదన్న అభిప్రాయం ఉంది. అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు ఒరిగిన ప్రయోజనమేమీ లేదని బహిరంగంగానే పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియా ద్వారా వాపోతున్నారు. కానీ వారి గోడును మాత్రం పట్టించుకోవడం లేదు. కూటమి నేతల మధ్య సయోధ్య లేకపోవడం కూడా మరొక తలనొప్పిగా తయారు కావచ్చు.. మరొకవైపు ఎమ్మెల్యేల అవినీతి, అక్రమాలను కూడా చూసీ చూడనట్లు పార్టీ నాయకత్వం వదిలేస్తుండటాన్ని కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నారు. టీడీపీకి బూత్ లెవెల్ లో భారీ బలగం ఉన్నప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంత మేరకు కసి తీరా పనిచేస్తుందన్నది మాత్రం సందేహంగానే ఉంది. మరొకవైపు ప్రత్యక్ష ఎన్నికల విధానం కూడా పార్టీకి నష్టం తెచ్చి పెడుతుందని అంటున్నారు. బీసీ నినాదం ఎత్తుకున్నా అవి న్యాయస్థానాలు ఎంత మేరకు అంగీకరిస్తాయన్నది కూడా అనుమానమే. ఇప్పటికే రిజర్వేషన్లపై హైకోర్టు చేసిన వ్యాఖ్యలు చూస్తే 34 శాతం బీసీ రిజర్వేషన్లతో ఈ ఎన్నికలకు వెళ్లే అవకాశాలు కనిపించడం లే?. స్థానిక సంస్థల్లో 34శాతం బీసీ రిజర్వేషన్ల అమలును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నప్పటికీ, న్యాయపరమైన చిక్కులు రాకుండా ఎన్నికలు నిర్వహించడం ప్రభుత్వానికి పెద్ద సవాల్. అయితే 16వ ఆర్థిక సంఘం నిధులను పొందడానికి, సకాలంలో స్థానిక సంస్థల పాలనను పునరుద్ధరించడం కోసం ఎన్నికలు నిర్వహించడం అవసరం. అందుకే స్థానిక సంస్థల ఎన్నికలు టీడీపీకి ఛాలెంజ్ అనే చెప్పాలి.

## ఎప్పూడూ ఆ నియోజకవర్గం రాజకీయమే

**అనంతపురం :** రాష్ట్రంలో వైసీపీ వర్సెస్ టీడీపీ, జనసేన అనేలా చాలా నియోజకవర్గాలు ఉన్నాయి. కానీ, ఓ నియోజకవర్గంలో మాత్రం 'అంతకుమించి' అన్నట్టుగా ఇరు పక్షాల మధ్య ముఖ్యంగా స్థానిక నేతల మధ్య రాజకీయాలు



రగులుతున్నాయి. నానాటికీ ఈ రాజకీయ వ్యూహాలు.. పెరుగుతూనే ఉన్నాయి. అదే...ఉమ్మడి అనంతపురం జిల్లాలోని తాడిపత్రి నియోజకవర్గం. ఇక్కడ జేసీ వర్సెస్ పెద్దారెడ్డి మధ్య రాజకీయాలు నిరంతరం నిప్పులు చెరుగుతూనే ఉన్నాయి ఇతర నియోజకవర్గాల్లోనూ వైసీపీ వర్సెస్ టీడీపీ అన్నట్టుగా రాజకీయాలు ఉన్నప్పటికీ.. ఇక్కడ మరింత భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. వైసీపీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని నియోజకవర్గంలోకి రాకుండా అడ్డుకుంటామని.. ఆయన నియోజకవర్గంలో అడుగు పెట్టేది కూడా లేదని శపథం చేసిన టీడీపీ సీనియర్ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి అలానే వ్యవహరిస్తున్నారు. గత రెండున్నరేళ్లుగా రాష్ట్రంలో రగులుతున్న ఏకైక నియోజకవ ర్గం కూడా ఇదే కావడం గమనార్హం... నియోజకవర్గంలో అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం ఎక్కడైనా ఉంటుంది. తాడిపత్రిలో మాత్రం రాజకీయాలకు ఇస్తున్న ప్రాధాన్యం వైసీపీ హయాంలోను.. ప్రస్తుత కూటమి హయాంలోనూ అభివృద్ధిని మించి ఉంటోందన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. యువ ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నా.. రాజకీయంగా జేసీ వేస్తున్న అడుగుల కారణంగా.. అభివృద్ధిపై పెద్దగా చర్చ జరగడం లేదు. గత వైసీపీ దెబ్బతిన్నది కూడా ఇక్కడే. ముందుగా అభివృద్ధిపై ప్రచారం ఎక్కువగా ఉంటే.. అది అల్టిమేట్‌గా పార్టీలకు కలిసి వస్తుంది. అన్నట్టుగా తాడిపత్రి నియోజకవర్గం మారిపోవడం గమనార్హం. సహజంగా ఎన్నికలకు ముందు రాజకీయాలు ఉంటాయి. కానీ, వైసీపీ వర్సెస్ టీడీపీ మధ్య ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యేల మధ్య వ్యక్తిగత అంశాలు ఎక్కువగా ప్రభావం చూపుతున్నాయి. దీనిని ప్రజలు ఎలా రిసీవ్ చేసుకుంటారు? అనే అంశంపైనే తాడిపత్రి నియోజకవర్గం భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. అంతకు మించి.. వ్యక్తిగత దూకుడును ప్రజలు అర్థం చేసుకుంటారా.. లేదా? అనేది చూడాలి. ప్రస్తుతం అయితే.. జేసీ హవా ఓ రేంజ్ లో సాగుతోందన్నది వాస్తవం.

## సమాజంలో సమూల మార్పులు విద్యతోనే సాధ్యం

-మొదటిపేజీ తరువాయి

ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 10,000 పాఠశాలల్లో 'వన్ క్లాస్ – వన్ టీచర్' విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చామని వెల్లడించారు. 'ప్రభుత్వ పాఠశాలల్లో అధికంగా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులే చదువుకుంటారు. వారిపై ఉపాధ్యాయులు మరింత ఆప్యాయత, శ్రద్ధ చూపాలి. చదువులో వెనుకబడిన పిల్లలను ప్రోత్సహించి ముందుకు నడిపించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం. నేటి సమాజంలో విద్యార్థుల్లో పెరుగుతున్న చెడు వ్యసనాలను కట్టడి చేయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలి. అదేవిధంగా ఈ సమస్య పరిష్కారానికి 'ఈగల్ క్లబ్' కీలక పాత్ర పోషిస్తుంది.ఇటీవల విశాఖలో ఓ విద్యార్థి మృతిచెందడం ఎంతో బాధాకరమని' లోకేశ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా పలువురు ఉపాధ్యాయులతో లోకేశ్ నేరుగా మాట్లాడారు. బోధనలో వారు అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక వారి సమస్యలు, సూచనలను స్వీకరించారు. విద్యావ్యవస్థ మెరుగుదల కోసం ప్రతి నెలా ఈ క్లస్టర్ సమావేశంలో తాను స్వయంగా పాల్గొంటానని హామీ ఇచ్చారు. లోపాలను సరి చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని ఆయన చెప్పారు. అంతకుముందు, విజయనగరం వై జంక్షన్ వద్దకు చేరుకున్న లోకేశ్‌కు మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మరియు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. డప్పుల దరువులతో, వివిధ రకాల జానపద కళారూపాలతో ఆయనకు స్వాగతం పలికారు. లోకేశ్‌ను చూసేందుకు విజయనగరానికి చెందిన మోహన్?రావు అనే ఓ టీడీపీ కార్యకర్త సైకిల్?పై వచ్చాడు. ఈ సందర్భంగా ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. గర్ల్స్ స్కూల్ వద్ద లోకేశ్?తో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించిన ఆయన ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశీర్వదించారు.

## స్వచ్ఛత మనందరి బాధ్యత

-మొదటిపేజీ తరువాయి

ప్రతి గ్రామానికి స్వచ్ఛ రథాలను పంపుతున్నామన్నారు. ఇంట్లోని చెత్త ఇస్తే బదులుగా మరొకటి ఇస్తారన్నారు. అభివృద్ధి అంటే పరిశ్రమలు, పెట్టుబడులు, కంపెనీలే కాదని స్వచ్ఛమైన ప్రాంతాలని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛత, పరిశుభ్రత కోసం ఆలోచించాలని సూచించారు. స్వచ్ఛత కోసం ముందుకొస్తున్న ప్రతిఒక్కరినీ అభినందిస్తున్నామన్నారు. మన ఊరు – మన బాధ్యత సంకల్పం అందరూ తీసుకోవాలన్నారు. మన ఇల్లు, వీధి, కార్యాలయం, బహిరంగ ప్రదేశాలు అన్నీ పరిశుభ్రంగా ఉండాలని తెలిపారు. ఆరోగ్యకర జీవనానికి స్వచ్ఛత మరింత అవసరం సీఎం చంద్రబాబు అన్నారు.

త్వరలోనే అనకాపల్లి, విశాఖకు గోదావరి నీళ్లు తెస్తామన్నారు. అనకాపల్లి జిల్లాలోని ప్రతి చెరువు, రిజర్వాయర్ నింపే బాధ్యత తమదని, సెప్టెంబర్ తొలి వారంలోనే అనకాపల్లికి నీళ్లు తెచ్చి చూపిస్తామని స్పష్టం చేశారు. క్వాంటం కంప్యూటర్ మన దేశానికి వస్తోందని సీఎం చంద్రబాబు వివరించారు. అమరావతి రావడం గర్వంగా భావిస్తున్నామన్నారు.

ఇంటిపై సోలార్ ప్యానెల్ పెట్టుకుంటే ఒక్క రూపాయి ఖర్చు ఉండదని సూచించారు. ఆడబిడ్డల కోసం 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నారు. రాబోయే రోజుల్లో 3 గ్యాస్ సిలిండర్ల డబ్బులు 4 నెలలకోసారి జమ చేస్తామన్నారు. ఇండక్షన్ స్టవ్‌లు పెట్టుకుంటే గ్యాస్‌తో కూడా అంత పని ఉండదని వివరించారు. 2047కు మోదీ నాయకత్వంలో దేశం అగ్రదేశంగా వికసిత్ భారత్ వెలుగొందుతుందన్నారు. 2047కు తలసరి ఆదాయం రూ.50 లక్షల వరకు పెరిగే అవకాశం ఉందని సీఎం చంద్రబాబు వివరించారు. 'డేటా సెంటర్ వస్తే లక్షల మందికి మంచి ఉద్యోగాలు వస్తాయి. ఆదాయం కూడా ఆకాశమే హద్దుగా ఉండబోతుంది. మంచి పనులు చేస్తుంటే అడ్డుకోవడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారు. గూగుల్ డేటా సెంటర్ కోసం సుందరమైన విశాఖకు వచ్చారని వేరే రాష్ట్రాలు ఆశ్చర్యపోతే ఇక్కడుండే వాళ్లు కొద్దిమంది జెండాలు పట్టుకుంటారన్నారు. ఇంతవరకూ డేటా సెంటర్ ప్రారంభం కాలేదు అప్పుడే నీళ్లు ఇంకిపోయాయంటారు. తాగడానికి నీళ్లు లేవంటూ దుష్ప్రచారం ప్రారంభించారు.'

## ఈ నెల 31న వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభిస్తాం

-మొదటిపేజీ తరువాయి

, నిర్వాసితులకు పరిహారం చెల్లించిన తర్వాతే ప్రాజెక్టును ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. పూర్తికాని వెలిగొండను పూర్తయినట్లు జగన్ జాతికి అంకితం చేయడం ప్రపంచంలోనే ఎనిమిదో వింత అని విమర్శించారు.

**3 దశాబ్దాల కల**

నిర్వాసితులకు చెల్లించాల్సిన రూ.900 కోట్ల పరిహారంలో జగన్ ప్రభుత్వం పైసా కూడా చెల్లించలేదని ఆరోపించారు. నిర్వాసితులను మోసం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని దుయ్యబట్టారు. ప్రాజెక్టు పనులతో పాటు నిర్వాసితుల సంక్షేమానికీ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. మొత్తం 7 నిర్వాసిత కాలనీల్లో 4 కాలనీల్లో 100 శాతం మౌలిక వసతులు పూర్తయ్యాయని, మిగిలిన 3 కాలనీల్లో పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని చెప్పారు. కరువు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు వెలిగొండ వరమని, 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందుతుందని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. 3 దశాబ్దాల కల నెరవేరుతున్నందుకు నిర్వాసితులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ చర్యల్ని వారు స్వాగతించారు. 'మా ముప్పై ఏళ్ల కల ఇప్పుడు నెరవేరుతోంది. మంత్రి నిమ్మల రామానాయుడు అపర భగీరథుడిలా ప్రయత్నం చేసి మాకు అండగా నిలబడ్డారు. ఆయన కృషి వల్లే వెలిగొండ పూర్తయ్యింది. ప్రతీ నిర్వాసితుడికి ఆర్‌అండ్ ఆర్ సొమ్ము జమ చేశారు. మాకు చాలా సంతోషంగా ఉంది. కూటమి ప్రభుత్వం మాకు అన్ని వేళలా అండగా ఉంది.' 40 రోజుల్లో 3 విడతలుగా రూ. 768 కోట్లు నిర్వాసుల ఖాతాల్లో వేశాం. వెలిగొండ ప్రాజెక్ట్ అందుబాటులోకి రావడంతో పాటు దీనికోసం భూములిచ్చిన, ఆస్తులు కోల్పోయిన వారికి న్యాయం చెయ్యడానికి సమ ప్రాధాన్యం ఇచ్చాం. ఈ మేరకు సీఎం చంద్రబాబు సంకల్పించారు. ఆఖరి నిర్వాసితుడి వరకూ ప్రతీ పైసా చెల్లించేలా నేను బాధ్యత తీసుకుంటాను.'

## లోకల్ పోల్స్ కోసం జనసేన ప్లాన్

-మొదటిపేజీ తరువాయి

స్థానాలు, పట్టున్న ప్రాంతాలను గుర్తించి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎమ్మెల్యేలను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో జనసేన శ్రేణుల మనోభావాలు, స్థానిక రాజకీయ వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకున్న తర్వాతే సీట్ల కేటాయింపు, అభ్యర్థుల ఎంపికపై నిర్ణయాలు ఉంటాయని తెలిపారు.ఇదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో కూటమి ధర్మానికి భిన్నంగా జరుగుతున్న పరిణామాలు, జనసేన శ్రేణుల అసంతృప్తిపై సమావేశంలో ఎమ్మెల్యేలు పార్టీ చీఫ్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన పవన్.. కార్యకర్తల మనోభావాలు, అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి ఐక్యతను కాపాడుకుంటూనే, జనసేన బలం ఉన్న ప్రతిచోటా గౌరవప్రదమైన ప్రాతినిధ్యం దక్కేలా చూస్తామని, రాబోయే స్థానిక ఎన్నికల్లో జనసేన తన సత్తా చాటుతుందని పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపారు.

**జనసేన కేడర లో కొత్త జోష్**

జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ పెట్టారు. ఈసారి రాజీ పడకూడదని నిర్ణయించుకున్నట్లు ఆయన మాటలను బట్టి తెలుస్తోంది. కూటమిలో పొత్తుకు భంగం కలగకుండా, తమకు నష్టం జరగకుండా స్థానాలను తీసుకోవాలని పవన్ కల్యాణ్ నిర్ణయించుకున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. ఇదే అభిప్రాయాన్ని త్వరలో చంద్రబాబు నాయుడు ముందు కూడా ఉంచనున్నారు. శాసనసభ ఎన్నికల తరహాలో తమ పార్టీకి తక్కువ స్థానాలు ఇవ్వాలన్న ఆలోచన ఉంటే వాటిని సరిచేసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించనున్నారు. ఈ మేరకు జనసేన పార్టీ ఎమ్మెల్యేలకు పవన్ కల్యాణ్ స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. 21 స్థానాల్లో పోటీ చేయడం అనేది అప్పటి పరిస్థితుల వరకే.. స్థానిక సంస్థల ఎన్నికల్లో సార్వత్రిక ఎన్నికల వ్యూహం వర్తించదు.. జనసైనికులు, వీర మహిళల ఆత్మగౌరవం కాపాడుతామని పవన్ కల్యాణ్ అనడం చర్చనీయాంశమైంది.. త్వరలోనే కమిటీలను నియమించి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని కూడా పవన్ నిర్ణయించారు. జనసేన శాసనసభ పక్ష సమావేశంలో పవన్ కల్యాణ్ ఈ వ్యాఖ్యలు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై లోతుగా చర్చించామని పవన్ కల్యాణ్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసైనికుల పోరాట స్ఫూర్తిని కొనసాగించేలా, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా ముందుకు తీసుకువెళ్తామని పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేలకు చెప్పారు. నేడు కేరళం కు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెళ్లనున్నారు. నేటి నుంచి 20 రోజులపాటు కేరళంలోని ప్రకృతి వైద్య చికిత్సా కేంద్రంలో ఉండనున్న పవన్ చికిత్స చేయించుకోనున్నారు.

# పారిశ్రామిక కారిడార్ గా ఉత్తరాంధ్ర.





- పరిశ్రమలు, ఫార్మా కేంద్రాలు, పెట్టుబడులతో నాలెడ్జ్ ఎకానమీ.
- డేటా సెంటర్ల పై కొందరు తప్పుడు ప్రచారం.
- ప్రారంభంకాకుండానే నీళ్లు ఇంకిపోతున్నాయని అపోహలు సృష్టి.
- ప్రతి గ్రామం జీరో వేస్ట్ గ్రామంగా మారాలి.
- మన ఊరు--మన బాధ్యతతో స్వచ్ఛాంధ్ర సాధిద్దాం.
- గ్రూప్-1లో అక్రమాలతో ఏపీపీఎస్సీ పై నమ్మకాన్ని దెబ్బతీశారు.
- గత పాలకుల తప్పిదాలను సరిదిద్దేందుకే మూడేళ్ల సమయం.
- అలమండ కోడూరు స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర సభలో సీఎం చంద్రబాబు.

**మాడుగుల, పెన్ సత్తా, ఆగస్టు 22:** ఉత్తరాంధ్రను పారిశ్రామిక కారిడార్‌గా తీర్చిదిద్దుతామని, అనకాపల్లి జిల్లాను రాష్ట్రం లోనే నంబర్-1 జిల్లాగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అనకాపల్లి ఇక బెల్లానికి మాత్రమే ప్రసిద్ధి చెందిన ప్రాంతం కాదని, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ సిటీ, డేటా సెంటర్లు, ఫార్మా, అల్యూమినియం తదితర పరిశ్రమలకు కేంద్రంగా మారుతోందని చెప్పారు. అనకాపల్లి ని అన్ని కంపెనీలకు కేంద్రంగా, నాలెడ్జ్ ఎకానమీకి చిరునామాగా తీర్చిదిద్దుతామని తెలిపారు. అలమండ కోడూరులో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ అలమండ కోడూరుగా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించిన గ్రీన్ అంబాసిడర్లను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అనకాపల్లి జిల్లా ఎన్డీఏకు కంచుకోటగా నిలిచిందని సీఎం చంద్రబాబు అన్నారు. గతంలో అనకాపల్లికి పెట్టుబడులు రాకపోవడంతో జిల్లా వెనుకబడిపోతుందని చాలామంది ఆందోళన చెందారని, ఇప్పుడు విశాఖకు మించి అనకాపల్లికి పెట్టుబడులు వచ్చే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ సిటీ నిర్మాణం జరుగుతోందని, డేటా సెంటర్లు, ఫార్మా, అల్యూమినియం తదితర పరిశ్రమలు వస్తున్నాయని తెలిపారు. ఉత్తరాంధ్రకు మణిహారంగా ఏఎస్ఆర్ విమానాశ్రయాన్ని ఇటీవల ప్రారంభించుకున్నామని సీఎం చెప్పారు. ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్ర ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు రెక్కలు తొడుగుతుందని అన్నారు. ఏఐ, డేటా సెంటర్ల గురించి చిన్నారులు సైతం మాట్లాడటం సంతోషంగా ఉందన్నారు. దేశంలో తొలిసారిగా క్వాంటం కంప్యూటింగ్‌ను రాష్ట్రానికి తీసుకురావడం గర్వకారణమని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని పారిశ్రామిక కారిడార్‌గా తీర్చిదిద్దుతామని సీఎం తెలిపారు. 10 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌ను నిర్మిస్తామని చెప్పారు. ఈ ప్రాంత యువతకు అవసర మైన నైపుణ్యాలు అందించేందుకు స్కిల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. పరిశ్రమలు, పెట్టుబడులు, మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి సమన్వయంతో అనకాపల్లిని భవిష్యత్తులో రాష్ట్రం లోనే అగ్రగామి జిల్లాగా తీర్చిదిద్దుతామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

డేటా సెంటర్లకు పోలవరం నీళ్ళు:

డేటా సెంటర్ల పై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం విమర్శించారు. డేటా సెంటర్ నిర్మాణం ఇంకా ప్రారంభం కాకముందే నీళ్లు ఇంకిపోతాయని ప్రచారం చేయడం సరికాదన్నారు. ఒక డేటా సెంటర్ ప్రారంభిస్తే ఐదు డేటా సెంటర్ల స్థాయికి ప్రాజెక్టులు వచ్చాయని, ఐదు గిగావాట్ల సామర్థ్యం ఇక్కడికి వస్తే లక్షలాది మంది ఏఐ ప్రొఫెషనల్స్ తయారయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. అన్ని డేటా సెంటర్లకు కలిపి 3.5 టీఎంసీల నీరు మాత్రమే అవసరమవుతుందని తెలిపారు. పోలవరం నుంచి వచ్చే నీటితో అనకాపల్లి జిల్లా లోని ప్రతి చెరువును నింపుతామని స్పష్టం చేశారు. వచ్చే నెల మొదటి వారంలో అనకాపల్లికి గోదావరి నీటిని తీసుకువస్తామని సీఎం ప్రకటించారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా వచ్చే నెల మొదటివారంలో అనకాపల్లికి నీరు పారిస్తామని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ రిజర్వాయర్ పనులను రూ.29 కోట్లతో చేపడతామని, రైవాడ ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగు, తాగునీరు అందిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. 30 ఏళ్ల క్రితం శ్రీకారం చుట్టిన వెలిగొండ ప్రాజెక్టును ఈ నెల 31 న ప్రారంభిస్తున్నామని సీఎం ప్రకటించారు. రెండేళ్లలో రాష్ట్రంలో రూ.2,250 కోట్లను అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేశామని తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడుకుంటూ అభివృద్ధి. అభివృద్ధి అంటే కేవలం పరిశ్రమలు, పెట్టు బడులు, కంపెనీలు రావడం మాత్రమే కాదని సీఎం అన్నారు. పరిశుభ్ర మైన ప్రాంతాలు, స్వచ్ఛ మైన పర్యావరణం కూడా అభివృద్ధిలో భాగమేనని చెప్పారు. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛత, సమాజహితం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇళ్లు, రోడ్లు, పరిసరాలు అన్నీ మనవే అన్న భావనతో పరిశు భ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ధర్మ కోనేరు పునరుద్ధరణ చేపట్టడాన్ని అభినందించారు. పారిశుద్ధ్య కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవలను సీఎం అభినందించారు. మన ఊరు--మన బాధ్యత సంకల్పాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఇల్లు, వీధి, కార్యాలయం, పాఠశాల, మార్కెట్.. ప్రతి ప్రదేశం పరిశుభ్రంగా ఉన్నప్పుడే స్వచ్ఛమైన పర్యావరణం సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి గ్రామాన్ని జీరో వేస్ట్ గ్రామంగా మార్చాలని, ఉత్పత్తి అయ్యే ప్రతి వ్యర్థాన్ని సమర్థంగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలో గత రెండేళ్లలో 143 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను డిస్పోజ్ చేశామని సీఎం తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో చెత్తను గుట్టలు గుట్టలుగా పోగేశారని, వర్షాల సమయంలో ఆ చెత్త వల్ల భూగర్భ జలాలు కలుషితమయ్యాయన్నారు. చెత్త నుంచి సంపద సృష్టిస్తామని చెప్పినప్పుడు ఆశ్చర్యంగా చూశారని, ఇప్పుడు చెత్త నుంచి గ్యాస్, ఎరువులు తయారు చేస్తున్నామని చెప్పారు. స్వచ్ఛ రథాల ద్వారా గ్రామాల్లో వ్యర్థాలను సేకరించి, వాటికి ప్రతిఫలంగా నిత్యావసర సరుకులు అందించే కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతం పెంచేలా చర్యలు చేపట్టామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. స్వయం పేరుతో డ్వాక్రా సంఘాల ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పిస్తున్నామని సీఎం తెలిపారు. కూటమి ప్రభుత్వం రెండింతల సంక్షేమాన్ని అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందన్నారు. గత పాలకులు సంక్షేమం పేరుతో రోడ్లను పట్టించుకోలేదని విమర్శించిన ఆయన, తమ ప్రభుత్వం రోడ్ల రూపురేఖలు మార్చిందని ముఖ్యమంత్రి చెప్పారు.

**రాజకీయాల్లో చెత్తనూ తొలగించాలి...**

ప్రజలు రాజకీయ చెత్తను కూడా కడిగేయాలని సీఎం పిలుపునిచ్చారు. ఎన్నికల్లో డబ్బు ప్రభావం లేకుండా చేయాల్సిన బాధ్యత ప్రజల పైనే ఉందన్నారు. ప్రజలు మంచి నాయకత్వాన్ని ప్రోత్సహించినప్పుడే రాజకీయ నాయకులు కూడా తప్పులు చేయకుండా ఉంటారని చెప్పారు. మంచి పనులు చేయాలంటే రాజకీయాల్లోనూ ప్రక్షాళన అవసరమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ప్రజలు మంచి--చెడును విశ్లేషించి మంచి ప్రభుత్వాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. 2019--24 మధ్య ఐదేళ్లలో గత ప్రభుత్వం విధ్వంసం, నేరాలనే నమ్ముకుందని సీఎం విమర్శించారు. నకిలీ, కల్తీ మద్యం కారణంగా 30 వేల మంది అనారోగ్యంతో చనిపోయారని ఆరోపించారు. ఇష్టానుసారంగా కల్తీ మద్యం వ్యవహారాలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని మండి పడ్డారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో నచ్చని వారి భూములను 22 ఏలో పెట్టిందని ఆరోపించారు. ఇప్పుడు ప్రతి నెలా 9 వ తేదీన 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమం కింద రాజముద్రతో పట్టాదారు పాస్‌పుస్తకాలు అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన దుర్మార్గాలను సరిదిద్దేందుకే తమకు మూడేళ్ల సమయం పడుతోందని సీఎం అన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా గత పాలకులు వ్యవహరించారని ముఖ్యమంత్రి విమర్శించారు. మెగా డీఎస్సీని అడ్డుకునేందుకు 300 కు పైగా పిటిషన్లు దాఖలయ్యాయని సీఎం తెలిపారు. వాటన్నింటినీ ఎదుర్కొని ఉద్యోగ నియామకాలు చేపడితే, ఏడాది తర్వాత డీఎస్సీపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఉపాధ్యాయులను అగౌరవపరిచేలా గతంలో వ్యవహరించారన్నారు. చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యమిస్తూ వారిని ప్రోత్సహించేలా ప్రభుత్వం పని చేస్తుంటే క్రీడా కోటాలో ఉద్యోగాలు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించడం సరికాదన్నారు. డీఎస్సీలో ఒక్క శాతం కూడా అవినీతి జరగలేదని, జరగనివ్వబోమని స్పష్టం చేశారు. గ్రూప్-1 సర్వీసు పరీక్షల మూల్యాంకనంలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని సీఎం ఆరోపించారు. ఇష్టానుసారంగా పేపర్లు దిద్దడంతో అర్హులైన అభ్యర్థుల భవిష్యత్తు అంధకార మైందన్నారు. ప్లంబర్లు, ఇంటి పనివారు, అటెండర్లు, ఎలక్ట్రీషియన్లతో గ్రూప్-1 సర్వీసు పేపర్లు దిద్దించారని ఆరోపించారు. ఆ వాస్తవాలు వెలుగులోకి వస్తున్న సమయంలో డీఎస్సీపై ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదన్నారు. తప్పు చేసిన వ్యక్తులు చట్టం నుంచి తప్పించుకోలేరని సీఎం చంద్రబాబు హెచ్చరించారు.

**అసమానతలు తగ్గాలి...పేదరికం పోవాలి:**

ఆర్థిక అసమానతలు తగ్గి ప్రతి ఒక్కరి ఆదాయం పెరగాలని సీఎం అన్నారు. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడినప్పుడే అభివృద్ధికి అసలైన బెంచ్‌మార్క్ అని చెప్పారు. దీపం--2.0 ద్వారా మూడు గ్యాస్ సిలిండర్లకు సంబంధించిన మొత్తాన్ని నాలుగు నెలలకు ఒకసారి ఆడబిడ్డల ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను పటిష్టంగా తీర్చిదిద్దుతున్నామని సీఎం చెప్పారు. ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు వచ్చే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ప్రపంచాన్ని జయించే విద్యార్థులను తీర్చిదిద్దే శక్తి మన ఉపాధ్యాయులకు ఉందని చెప్పారు. 2047 నాటికి భారత్ అగ్రదేశంగా, వికసిత్ భారత్‌గా అవతరిస్తుందని సీఎం అన్నారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ కూడా 2047 నాటికి అధిక తలసరి ఆదాయంతో అభివృద్ధి చెందిన రాష్ట్రంగా నిలవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వంగలపూడి అనిత, నారాయణ, కొల్లు రవీంద్ర, ఎంపీలు సీఎం రమేష్, చింతకాయల విజయ్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సహా జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.





## రాష్ట్ర ముఖ్యమంత్రి కి ఘన స్వాగతం.



**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్ట్ 22:**స్వర్ణాంధ్ర స్వచ్ఛాఆంధ్ర కార్యక్రమములో పాల్గొనేందుకు శనివారం ఉదయం రాష్ట్ర ముఖ్యమంత్రి అనకాపల్లి జిల్లా కె-కోటపాడు మండలం, ఏ-కోడూరు గ్రామంలో హెలికాప్టర్ ద్వారా చేరుకున్నారు. జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, హోమ్ శాఖామాత్యులు వంగలపూడి అనిత, మంత్రులు నారాయణ, ఎంపీలు రమేష్, చింతకాయల విజయ్, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి, పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు, యలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్, చోడవరం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్ లు, డైరెక్టర్ లు, జిల్లా, మండల నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి కి ఘన స్వాగతం పలికారు.

## విశాఖ సమావేశ మందిరంలో మంత్రి నారాయణ సమీక్ష సమావేశం.

విఎంఆర్డిఏ పరిధిలో రూరల్ మున్సిపల్ అంశాలు పై సమీక్షలో కమిషనర్.




**విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్ట్ 22:**యలమంచిలి, నర్సీపట్నం, నెలిమర్ల, మున్సిపల్ అభివృద్ధి పనులు పై సమీక్ష జరుపుతున్న మంత్రి నారాయణ. ఈ సమీక్షలో పాల్గొన్న యలమంచిలి నియోజవర్గం శాసన సబ్యులు సుందరపు విజయ్ కుమార్, లోకం మాధవి లు. సమీక్ష అనంతరం మీడియా తో మాట్లాడిన మంత్రి నారాయణ

రాష్ట్రంలో 123 మున్సిపాలిటీ లున్నాయని వాటిల్లో గత వైసీపీ ప్రభుత్వం చెత్త వదిలేసి పోయిందన్నారు.

ప్రజలు కట్టిన సొమ్ములు మళ్లింపు చేసింది, చెత్త పన్ను వేసి 153 లక్షల టన్నులు చెత్త వదిలేశారు. ఇప్పుడు ఆ చెత్తను వేగంగా క్లీన్ చేశాం అని, ఇప్పటికి 140 లక్షల టన్నులు చెత్త తొలగించాం అన్నారు. 2014 లో రాష్ట్రం లో చెత్త నుంచి విద్యుత్ తీసే 10 ప్లాంట్ లు కేటాయించారని వాటిలో ఈ రోజు రెండు ప్లాంట్ లు మొదలయ్యాయి అన్నారు. కేంద్ర ప్రభుత్వ అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ఇచ్చారు. యలమంచిలి 24, నెల్లిమర్ల 25, నర్సీపట్నం 27 విజయవాడ కు 206

రాష్ట్ర వ్యాప్తంగా 10,200 కోట్లు నిర్దేశించాం అని తెలిపారు.

రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీ అమృత్ పథకం కింద పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఏడాది లో ఈ పనులు పూర్తి అవుతాయన్నారు.

మంచినీటి కుళాయి పనులు ఐన తరవాతే రోడ్లు వేస్తాం అని దీనిని ప్రజలు గుర్తించాలన్నారు. వాటర్, యూ జి డి పనులు పెద్ద ఎత్తున చేస్తున్నాం అని మంత్రి తెలిపారు. సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ

లోటు బడ్జెట్ ఉన్నా కూడా నిధులు మంజూరు చేశారని, యలమంచిలిలో 24 కోట్లు ఇస్తున్నారన్నారు.

రాష్ట్ర వ్యాప్త మౌలిక సదుపాయాలకు 5,500 కోట్లు ఇస్తున్నారు.

నా నియోజక వర్గంలో వాటర్ స్కిం కింద 50 కోట్లు ఇచ్చారని, అంతే కాకుండా

యలమంచిలి లో ఎస్ టి పి ఏర్పాటు చెస్తున్నారని తెలిపారు. నెల్లిమర్ల నియోజక వర్గ శాసన సభ్యురాలు లోకం మాధవి మాట్లాడుతూ 2009 లో నగర పంచాయతీ గా మార్చారు. 2024 లో మున్సిపల్ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. నియోజకవర్గంలో 6 కోట్లు అభివృద్ధి పనులు చేస్తున్నాం. నీటి కోసం 48 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## ఎస్--3 స్పోర్ట్స్ అరేనాను సందర్శించిన

# చైనా క్రీడా ప్రతినిధి బృందం.

- యువ క్రీడాకారులతో మమేకం... క్రీడా శిక్షణ, మౌలిక వసతుల పై ఆసక్తి.
- గ్రామీణ స్థాయి నుంచి క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తున్న విధానాల పై ప్రతినిధులకు వివరణ.
- క్రీడల అభివృద్ధిలో భారత్--చైనా పరస్పర సహకారం మరింత బలోపేతం కావాలని ఆకాంక్ష.






**విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్టు 22:** విశాఖ వేదికగా జరుగుతున్న అంతర్జాతీయ బ్రిక్స్ కార్యక్రమం సందర్భంగా చైనాకు చెందిన ఉన్నత స్థాయి క్రీడా ప్రతినిధి బృందం శనివారం జీవీఎంసీ ఈస్ట్ జోన్, ఎంవీపీ కాలనీ లోని ఎస్--3 స్పోర్ట్స్ అరేనాను సందర్శించింది. చైనా జనరల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ స్పోర్ట్ వైస్ మినిస్టర్ కుయ్ జియాన్ నేతృత్వం లోని ప్రతినిధి బృందానికి జీవీఎంసీ అదనపు కమిషనర్ పల్లి నల్లనయ్య స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ప్రతినిధులు యువ క్రీడాకారులు, విద్యార్థులతో మమేక మై వారి క్రీడా శిక్షణ, వివిధ క్రీడాంశాల్లో అందిస్తున్న ప్రోత్సాహం, ప్రతిభాభివృద్ధి కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. చిన్నారులకు బహుమతులు అందించి వారిని ప్రోత్సహించారు. గ్రామీణ, క్షేత్రస్థాయి నుంచే క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికత మేరకు ఆంధ్రప్రదేశ్‌లో చేపడుతున్న క్రీడాభివృద్ధి కార్యక్రమాలు, వివిధ స్థాయిల్లో పోటీల నిర్వహణ ద్వారా క్రీడాకారులకు కల్పిస్తున్న అవకాశాలను ప్రతినిధి బృందానికి వివరించారు. రాష్ట్రంలో నిర్వహించిన జాతీయ, అంతర్జాతీయ క్రీడా కార్యక్రమాల గురించి కూడా తెలియజేశారు. ఈ సందర్భంగా కుయ్ జియాన్ మాట్లాడుతూ, క్రీడలంటే ప్రత్యర్థిని ఓడించడం మాత్రమే కాదని, తనను తాను అధిగమిస్తూ నిరంతరం మెరుగుపరుచు కోవడం, అపజయాల నుంచి తిరిగి నిలబడే ధైర్యాన్ని పెంపొందించు కోవడం కూడా క్రీడా స్ఫూర్తిలో భాగమని యువ క్రీడాకారులకు సందేశమిచ్చారు. క్రీడల అభివృద్ధిలో భారత్--చైనా మధ్య సహకారం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

అనంతరం ప్రతినిధులు స్పోర్ట్స్ అరేనాలోని జిమ్నాజియం, స్విమ్మింగ్ పూల్ తదితర క్రీడా సదుపాయాలను పరిశీలించి అభినందించారు. ముఖ్యంగా బ్యాడ్మింటన్ కోర్టును అవసరానికి అనుగుణంగా బాస్కెట్‌బాల్ కోర్టుగా మార్చగల ఆధునిక మల్టీపర్పస్ సాంకేతిక వ్యవస్థను ఆసక్తిగా పరిశీలించారు. స్నేహం, సాంస్కృతిక మార్పిడికి గుర్తుగా చైనా ప్రతినిధి బృందం ‘రెడ్ హార్స్’ చిత్రంతో కూడిన జ్ఞాపికను అందజేసింది. యువ క్రీడా ప్రతిభను ప్రోత్సహించడం, క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి, భారత్--చైనా క్రీడా సహకారాన్ని మరింత బలోపేతం చేయడంలో ఈ సందర్శన పరస్పర అనుభవాల మార్పిడికి వేదికగా నిలిచిందని అదనపు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ జాన్ జూలియట్, జీవీఎంసీ ఈస్ట్ జోనల్ కమిషనర్ కె . శివ ప్రసాద్ , జీవీఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ ఈ. అప్పలరాజు, సహాయకు వైద్యాధికారి బి. ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## కాగిత రెవెన్యూలో భూ బదలాయింపు పై గ్రామసభ నిర్వహించాలి

కాగిత ప్రత్యేక అధికారిని కోరిన రైతులు



**నక్కపల్లి, పెన్ సత్తా,ఆగష్టు 22:** కాగిత రెవెన్యూ పరిధిలో ఏ ఎన్ ఎం ఎస్ కు భూములు బదలాయింపు ప్రక్రియను నిలుపుదల చేసేందుకు కాగిత రైతులతో గ్రామసభ నిర్వహించాలని కాగిత గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి డి. సీతారామరాజును కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. కాగిత రెవెన్యూ లో చెరువుల గర్భం, గెడ్డ వాగులు, పాత గ్రామకంఠం, రహదారులు, నీటి వనరులు సుమారు 17 ఎకరాల భూమిని ఏ ఎం ఎస్ ఎస్ కు బగలాయింపు చేస్తున్నట్టు తాసిల్దార్ కార్యాలయం నుండి లెటర్ నెంబర్ 221తో ఈనెల 10వ తేదీన కాగిత గ్రామ సచివాలయం వద్ద 1ఏ నోటీసు ప్రదర్శించడం జరిగిందని రైతులు తెలిపారు. దీనిపై ఆక్షేపణలు అభ్యంతరాలు ఉంటే గ్రామసభ ద్వారా తెలియచేయాలని నోటీసులో పేర్కొనడం జరిగిందని తెలిపారు. దీనిపై కాగిత గ్రామంలో గ్రామసభ నిర్వహించి రైతుల అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని భూ బదలాయింపును వ్యతిరేకిస్తున్నట్టు తీర్మానం చేయాలని పంచాయతీ ప్రత్యేక అధికారి డి సీతారామరాజుకు మెమొరండం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో వైస్ ఎంపీపీ వీసం నానాజీ, కాగిత గ్రామపంచాయతీ తాజా మాజీ సర్పంచ్ పోతంశెట్టి రాజేష్, రైతులు దేవరపు శివ, పోతంశెట్టి బాబ్జి, దేవవరపు ఉమా, రాజా తదితరులు ఉన్నారు.

# స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి.



**మాడుగుల, పెన్ సత్తా, ఆగస్ట్ 22:**

స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రశంగం ముఖ్య అంశాలు.

స్వయం పేరుతో డ్వాక్రా సంఘాల ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పిస్తున్నాం.

కూటమి ప్రభుత్వం రెండింతలు సంక్షేమం అందిస్తూ అభివృద్ధి చేస్తోంది.

గత పాలకులు సంక్షేమం ఇస్తున్నామని రోడ్లు వేయలేదు, మేం రోడ్ల రూపు రేఖలు మార్చాం. ప్రజలు రాజకీయ చెత్తను కూడా కడిగేయాలని పిలుపు నిస్తున్నాను. ఎన్నికల్లో డబ్బు ప్రభావం లేకుండా చేయాల్సిన బాధ్యతను ప్రజలే తీసుకోవాలి. అప్పుడే రాజకీయనేతలూ తప్పులు చేయరు. 5 ఏళ్ల పాటు గొడ్డలి పార్టీ విధ్వంసాలను, నేరాలను, ఘోరాలనే నమ్ముకుంది. 2019-24 మధ్య నకిలీ మద్యం కారణంగా 30 వేల మంది అనారోగ్యంతో చనిపోయారు.

ఇష్టానుసారంగా కల్తీ మద్యంతో రాష్ట్రాన్ని గొడ్డలి పార్టీ సర్వనాశనం చేసింది. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చి నచ్చని వారి భూముల్ని 22 ఏలో పెట్టింది. ఇప్పుడు ప్రతీ నెలా 9 తేదీన మీ భూమి- మీహక్కు పేరిట రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తున్నాం. గత ప్రభుత్వం చేసిన దుర్మార్గాలను సరిచేసేందుకే 3 ఏళ్లు సమయం పడుతోంది. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా గత పాలకులు దుర్మార్గంగా వ్యవహరించారు.

మెగా డీఎస్సీని అడ్డుకోడానికి 3 వందల పిటీషన్లు వేశారు. అవన్నీ ఎదుర్కొని ఉద్యోగాలిస్తే ఏడాది తర్వాత ఆరోపణలు చేస్తున్నారు. ఉపాధ్యాయులను అగౌరవ పరిచేలా వ్యవహరించారు. ర్యాంక్ వచ్చిన వ్యక్తి వెరిఫికేషన్ కు సర్టిఫికెట్లు తేకపోతే ఎవరితప్పు. క్రీడా కోటాను 2 నుంచి 3 శాతానికి పెంచి ఉద్యోగాలు ఇచ్చాం. చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలి. క్రీడా కోటాలో ఉద్యోగాలిస్తే ఎందుకిచ్చారని అంటున్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల ప్రకారమే వీటిని ఇచ్చాం. ఎవరో ఎక్కడో డబ్బులు అడిగారని మొత్తం డీఎస్సీకి అంటగట్టే ప్రయత్నం జరుగుతోంది.

గొడ్డలి పార్టీ అధినేత పీఏ వందల కోట్లు సంపాదించారు దాని గురించి ఎందుకు మాట్లాడటం లేదు. డీఎస్సీలో ఒక్క శాతం కూడా అవినీతి జరగలేదు, జరగనివ్వం కూడా. గ్రూప్ 1 సర్వీసు పరీక్షల మూల్యాంకనంలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయి.

ఇష్టానుసారంగా పేపర్లు దిద్దేసి అర్హులైన అభ్యర్థుల భవిష్యత్తును అంధకారం చేశారు. ప్లంబర్లు, ఇంట్లో పనివారు, అటెండర్లు, ఎలక్ట్రీషియన్లతో గ్రూప్ 1 సర్వీసు పేపర్లను దిద్దించారు.

ఆ వాస్తవాలు వెలుగు చూస్తుంటే ఇప్పుడు డీఎస్సీ పై ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. తప్పు చేసిన వ్యక్తులు చట్టం నుంచి తప్పించుకోలేరని హెచ్చరిస్తున్నాను. మంచి పనులు చేయాలంటే రాజకీయాల్లోనూ ప్రక్షాళన అవసరం. 30 ఏళ్ల క్రితం శ్రీకారం చుట్టిన వెలిగొండ ప్రాజెక్టును ఈ నెల 31 తేదీన ప్రారంభిస్తున్నాం. రెండేళ్లలో రూ.2,250 కోట్లు ఖర్చు చేశాం. ప్రజలూ మంచినీ చెడును విశ్లేషించి మంచి ప్రభుత్వాన్ని ప్రోత్సహించాలి. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి కూడా వచ్చే నెలలోనే నీరు పారిస్తాం.

ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని పారిశ్రామిక కారిడార్ గా తీర్చిదిద్దుతాం. 10 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ టౌన్ షిప్ నిర్మిస్తాం.

ఈ ప్రాంతంలో యువతకు స్కిల్ సెంటర్ ఏర్పాటు చేసి నైపుణ్యాలు కల్పిస్తాం.

ఎన్టీఆర్ రిజర్వాయర్ పనుల్ని రూ.29 కోట్లతో చేపడతాం. రైవాడ ప్రాజెక్టు పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగు, తాగునీరు అందిస్తాం.

# సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్ళు అనేదే మా సిద్ధాంతం లోకేష్.



**సమాజంలో మార్పు కోసం విద్యావంతు లైన యువత రాజకీయాల్లోకి రావాలి.**

**క్రీడల్లో మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ‘షీ ప్లే’ విధానం.**

**ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దడమే లక్ష్యం.**

**దివీస్ ల్యాబ్ సహకారంతో ఆధునీకరించిన జడ్పీ పాఠశాలను ప్రారంభించిన లోకేష్.**

**విద్యార్థులతో మంత్రి నారా లోకేష్ ముఖాముఖి.. సరదాగా వాలీబాల్ ఆట.**

**విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్ట్ 22:** విశాఖ జిల్లా మధురవాడ లోని చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలను ‘ప్రాజెక్ట్ చంద్రా’లో భాగంగా దివీస్ ల్యాబ్స్ సహకారంతో ఆధునీకరించిన అనంతరం రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. పాఠశాలకు చేరుకున్న మంత్రి లోకేష్ కు వేదపండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆధునీకరించిన తరగతి గదులు, క్రీడా మైదానాలు, ఇతర మౌలిక వసతులను మంత్రి లోకేష్ పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మంత్రి లోకేష్ సరదాగా కాసేపు వాలీబాల్ ఆడారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాధారణ ప్రారంభోత్సవ కార్యక్రమాలకు భిన్నంగా ఈసారి మంత్రి నారా లోకేష్ విద్యార్థులతో నేరుగా ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సరదాగా, స్ఫూర్తిదాయకంగా సమాధానాలు ఇచ్చారు.

విద్యార్థి ప్రశ్న: ఇంతకుముందు మీరు చూసిన చంద్రంపాలెం పాఠశాలకు, ఇప్పుడు చూస్తున్న పాఠశాలకు ఉన్న తేడా ఏంటి?. మంత్రి సమాధానం: “చంద్రంపాలెం పాఠశాలకు నేను గతంలో రెండుసార్లు వచ్చినప్పుడూ రెండుసార్లు వర్షం పడింది. గతంలో పాఠశాల పరిసరాలు బురదమయంగా ఉండేవి. ప్రస్తుతం పూర్తి స్థాయిలో ఆధునీకరించడంతో పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. నేను పైలెట్ ప్రాజెక్ట్ కింద మంగళగిరిలో ఆధునీకరించిన పాఠశాలకు కూడా మూడుసార్లు వెళ్లలేదు. కానీ ఈ చంద్రంపాలెం జెడ్పీ పాఠశాలకు మాత్రం మూడు సార్లు వచ్చాను. రాష్ట్రం లోని ప్రతి ప్రభుత్వ పాఠశాల ఇదే విధంగా అభివృద్ధి చెందాలన్నదే మా లక్ష్యం అని అన్నారు. విద్యార్థి ప్రశ్న: మీకు ఇష్టమైన ఆట ఏంటి?, ఇప్పటికీ ఆడుతున్నారా?.

మంత్రి సమాధానం: ప్రతి భారతీయుడిలాగే నాకు క్రికెట్ అంటే ఇష్టం. ప్రతి ఆదివారం నా కుమారుడు దేవాన్ష్‌తో కనీసం రెండు గంట లైనా క్రికెట్ ఆడతాను. అంతకుమించి ముఖ్యమంత్రి నాకు అవకాశం ఇవ్వడం లేదు అని సరదాగా వ్యాఖ్యానించారు.

విద్యార్థిని ప్రశ్న: క్రీడల్లో మహిళలకు అవకాశాలు తక్కువగా ఉన్నాయి కదా?.

మంత్రి సమాధానం: ఇది వాస్తవమే క్రీడల్లో మహిళలు రావడానికి అనేక అడ్డంకులు వస్తున్నాయి. తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడం, పాఠశాలల్లో సరైన క్రీడా వసతులు లేకపోవడం, ఇలా ఏదైనా కావొచ్చు మహిళలు క్రీడా రంగంలో అవకాశాలు తక్కువగా ఉంటున్నాయి. అందుకే మహిళలను క్రీడల్లో మరింతగా ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా ‘షీ ప్లే’ విధానాన్ని తీసుకొస్తున్నాం. రాష్ట్రం లోని ప్రతి పాఠశాలలో క్రీడా మౌలిక వసతులను అభివృద్ధి చేసి బాలికలకు మరిన్ని అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. చంద్రంపాలెం పాఠశాల లోనే ఇద్దరు విద్యార్థినులు బాస్కెట్‌బాల్ రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నారు. ఇలానే రాష్ట్రంలోని ప్రతి పాఠశాలలో విద్యార్థినులు క్రీడా రంగం లోకి రావాలి అని ఆకాంక్షించారు. తెలుగు క్రీడాకారిణి శ్రీచరణి ఉదాహరణను ప్రస్తావిస్తూ.. శ్రీచరణిని కూడా మొదట్లో క్రికెట్ ఆడేందుకు తన తల్లిదండ్రులు ఒప్పుకోలేదు, ఆడేందుకు అవకాశం కల్పిస్తేనే 10 వ తరగతి పరీక్షలు రాస్తానని చెప్పడంతో చివరకి ఆడేందుకు అవకాశం కల్పించారు. ఇప్పుడు తను వరల్డ్ లోనే ఉత్తమ బౌలర్. ప్రతిభకు సరైన అవకాశం లభిస్తే మహిళలు ప్రపంచ స్థాయిలో రాణించగలరనడానికి శ్రీచరణినే నిదర్శనం అని అన్నారు.

యిలా విద్యార్థులు, మంత్రి లోకేష్ మధ్యలో సరదాగా ప్రశ్న జవాబు కార్యక్రమం నడిచింది. డాక్టర్, ఐఏఎస్, ఐపీఎస్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, సైంటిస్ట్, టీచర్, బిజినెస్‌మెన్ వంటి వృత్తుల్లోకి వెళ్లాలని ఎంతమంది కోరుకుంటున్నారు అని లోకేష్ విద్యార్థులను అడిగారు. అనంతరం రాజకీయాల్లోకి రావాలని ఎంతమంది కోరుకుంటున్నారని ప్రశ్నించారు. సమాజంలో తాము కోరుకునే మార్పు తీసుకురావాలంటే విద్యావంతులు, ఆలోచించే యువత పెద్దఎత్తున రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. రాజకీయాలు కేవలం పదవులు, ఎన్నికలకు పరిమితం కాదని, ప్రజల జీవితం, సమాజ భవిష్యత్తును ప్రభావితం చేసే కీలకమైన వేదిక అని చెప్పారు. విద్యార్థులు చదువుతో పాటు సమకాలీన అంశాలు, ప్రపంచంలో జరుగుతున్న పరిణామాలు, దేశ అభివృద్ధి, సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులు, జనరల్ నాలెడ్జ్ పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తని, కేవలం ఉద్యోగాల కోసం కాకుండా సమాజం, రాష్ట్రం, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. నేను మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మంత్రి నారాయణ ని, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ని కలిశాను. అప్పుడు వారు నాకు ఒక ముఖ్య మైన సలహా ఇచ్చారు. ప్రతి పాఠశాలలో ప్రాథమిక తరగతులకు ‘వన్ క్లాస్ -- వన్ టీచర్’ విధానాన్ని తీసుకువస్తే విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. వారి సూచనను పరిగణన లోకి తీసుకుని ఆ విధానాన్ని అమలు చేశాం. ప్రస్తుతం 10 వేల పాఠశాలల్లో ‘వన్ క్లాస్ -- వన్ టీచర్’ విధానం అమల్లో ఉంది” అని తెలిపారు. దివీస్ ల్యాబ్స్‌కు మంత్రి లోకేష్ ప్రత్యేక ధన్యవాదాలు:

చంద్రంపాలెం పాఠశాలను ఆధునీకరించేందుకు పిలుపునిచ్చిన వెంటనే.. ఖర్చు ఎంత అవుతుందనే ఆలోచన చేయకుండా ముందుకు వచ్చి పాఠశాలను ఇంత అద్భుతంగా అభివృద్ధి చేసిన దివీస్ ల్యాబ్స్ డైరెక్టర్ నీలిమకు మంత్రి నారా లోకేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వంతో కలిసి విద్యా రంగ అభివృద్ధికి దివీస్ ల్యాబ్స్ అందించిన సహకారం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, వి.ఎం.ఆర్.డి.ఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, దివీస్ ల్యాబ్ సిబ్బంది, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంటింటా నెట్‌జీరో... ఆదర్శ గ్రామాలే లక్ష్యం.





**ఇంటి నుంచే పర్యావరణ పరి రక్షణకు శ్రీకారం.**

**అలవరం కోడూరులో నెట్‌జీరో విధానాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు.**

**మాడుగుల, పెన్ సత్తా, ఆగస్టు 22:** పర్యావరణ పరి రక్షణను ఇంటింటి ఉద్యమంగా మార్చి, గ్రామాలను పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం నెట్ జీరో గ్రామాల కార్యక్రమాన్ని అమలు చేస్తోందని సీఎం చంద్రబాబు అన్నారు. ఇంటి స్థాయి నుంచి కాలనీ, గ్రామ స్థాయి వరకు పర్యావరణహిత విధానాలను అమలు చేస్తూ.. క్రమంగా గ్రామాలను నెట్ జీరో కమ్యూనిటీలుగా మార్చే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గం లోని అలవరం కోడూరులో శనివారం స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని నెట్ జీరో కార్యక్రమాలను పరిశీలించారు. నెట్ జీరో గ్రామంలో అమలు చేస్తున్న కార్యక్రమాలు, సాధిస్తున్న లక్ష్యాలను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ముఖ్యమంత్రికి వివరించారు. ఇంటింటా సౌర విద్యుత్ వినియోగం, పరిశుభ్ర మైన వంట విధానాలు, తడి వ్యర్థాలతో సేంద్రియ ఎరువు తయారీ, మురుగునీటి నిర్వహణ వంటి చర్యల ద్వారా కార్బన్ ఉద్గారాలను తగ్గించడంతో పాటు గ్రామాలను పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు.

వంటింటి వ్యర్థాలే సేంద్రియ ఎరువులు.

నెట్ జీరో కార్యక్రమాలను అమలు చేస్తున్న జె. మహేశ్వర రావు నివాసాన్ని సీఎం చంద్రబాబు సందర్శించారు. మహేశ్వర రావు, ఆయన సతీమణి ఇంట్లో చేపడుతున్న పర్యావరణహిత కార్యక్రమాలను ముఖ్యమంత్రికి వివరించారు. ఇంటి నుంచి వెలువడే తడి వ్యర్థాలను ప్రత్యేక కంపోస్టింగ్ గుంతల్లో వేస్తూ అక్కడి కక్కడే సేంద్రియ ఎరువుగా మార్చుతున్న విధానాన్ని సీఎంకు చూపించారు. ఇలా ఇంట వండే తడి వ్యర్థాలను ఎరువుగా మార్చడం వల్ల ఎరువుల కొనుగోలు ఖర్చు తగ్గుదలతో పాటు వ్యర్థాల సేకరణ, రవాణా, నిర్వహణకు అయ్యే శ్రమ కూడా తగ్గుతుందని వివరించారు. వ్యర్థాన్ని సమస్యగా కాకుండా వనరుగా మార్చే ఈ విధానం గ్రామాల్లో విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

మురుగునీటికి ఇంటి వద్దే పరిష్కారం.

ఇంటి నుంచి వెలువడే మురుగునీటిని రోడ్ల పైకి వదలకుండా నిర్దేశిత గుంతల్లోకి మళ్లించే ఇన్‌సిటు వేస్ట్‌వాటర్ మేనేజ్‌మెంట్ విధానాన్ని కూడా సీఎం పరిశీలించారు. దీంతో కాలనీ రోడ్ల పై మురుగునీరు నిల్వ ఉండకుండా చూడటంతో పాటు దోమలు, ఈగల వృద్ధిని నియంత్రించవచ్చని లబ్ధిదారు వివరించారు. ఈ విధానం ద్వారా నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల ముప్పును తగ్గించడంతో పాటు కుటుంబాలకు, చుట్టుపక్కల ప్రజలకు పరిశుభ్ర మైన, ఆరోగ్యకర మైన వాతావరణం కల్పించవచ్చని తెలిపారు. ఇంధన వినియోగాన్ని తగ్గించేలా ఇంట్లో ఏర్పాటు చేసిన ఇండక్షన్ స్టవ్ పనితీరును కూడా లబ్ధిదారు ముఖ్యమంత్రికి వివరించారు. దీపం పథకం కింద ప్రభుత్వం ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నప్పటికీ.. ఇండక్షన్ స్టవ్‌ను ప్రత్యామ్నాయంగా వినియోగించడం ద్వారా గ్యాస్ పై ఆధారపడటాన్ని తగ్గించవచ్చని తెలిపారు. ఇండక్షన్‌తో వంట వేగంగా, పరిశుభ్రంగా ఉండటంతో పాటు గ్యాస్ సిలిండర్ల వినియోగం తగ్గుతుందని వివరించారు. అనంతరం ఇంటి పై ఏర్పాటు చేసిన 3 కిలోవాట్ల సోలార్ రూఫ్‌టాప్‌ను సీఎం పరిశీలించారు. సౌర విద్యుత్ తోనే ఇండక్షన్ స్టవ్‌ను వినియోగించడం ద్వారా అదనపు విద్యుత్ వ్యయాన్ని కూడా తగ్గించుకోవచ్చని లబ్ధిదారులు తెలిపారు. అనంతరం లబ్ధిదారు కుటుంబంతో ముఖ్యమంత్రి చంద్రబాబు సెల్ఫీ దిగారు.



# నక్కపల్లి లో ఘనంగా మెగాస్టార్ జన్మదిన వేడుకలు





**నక్కపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 22:** మండల కేంద్రం నక్కపల్లి లో మెగాస్టార్ చిరంజీవి 71 వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మెగాస్టార్ చిరు అసోసియేషన్ సభ్యులు మీగడ సత్యనారాయణమూర్తి, కొలనాటి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం చిరంజీవి జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ లు పాల్గొని మెగాస్టార్ చిరంజీవి బర్త్డే కేక్ కట్ చేసి మెగాస్టార్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ వెంకటేశ్ లు మాట్లాడుతూ భారత దేశవ్యాప్తంగా ఉత్తమమైన నటుడిగా కోట్లాదిమంది అభిమానాన్ని సంపాదించుకున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదినం పురస్కరించుకుని మెగా అభిమానులు వారం రోజులుగా పేదలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. అభిమాన నాయకుడు చిరంజీవి మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని వీరంతా ఆకాంక్షించారు. ఈ ఈ సందర్భంగా మెగాస్టార్ అసోసియేషన్ సభ్యులు మేఘట సత్తిబాబు, పల్నాటి దుర్గాప్రసాదులను అభిమానులు సాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలు అభిమాన సంఘాల నాయకులు, చిరు అభిమానులు పాల్గొన్నారు.

# టౌన్ ప్లానింగ్ అనుమతులు లేకుండా బఫర్ జోన్ లో అనధికార నిర్మాణం.





**లంకెలపాలెం పెన్ సత్తా, ఆగస్టు 22:.:** జీవీఎంసీ పరిధి 79 వ వార్డు లంకెలపాలెం ఏలేరు కాలువ ఆనుకొని ఉన్న బఫర్ జోన్లో ఒక అనాధికార నిర్మాణం సర వేగంగా జరుగుతుంది. జనసేన పార్టీకి చెందిన నాయకుడు నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడం నిర్మాణం చేపట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకనే తమ ఉద్యోగానికి ఇబ్బంది వస్తుందని టౌన్ ప్లానింగ్ సిబ్బంది చర్యలకు వెనకాడుతున్నారనే గుసగుసలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆదాయాన్ని రక్షణగా నిలవాల్సిన అధికారి పార్టీ నాయకులే కంచె చేలు మేసిన చందంలా జీవీఎంసీ ఆదాయానికి గండి కొడుతూ లంకెలపాలెం సర్వే నెంబర్ 42లో భారీ అక్రమ నిర్మాణానికి పాల్పడుతుండటం కొసమెరుపు. అనధికార నిర్మాణం పట్ల టౌన్ ప్లానింగ్ సిబ్బంది మేనమామాలు లెక్కిస్తూ చూస్తూనే ఉన్నారు తప్ప ఎటువంటి అభ్యంతరాలు తెలుపకుండా మీన్నకుండిపోయారు. సాధారణ ప్రజలు చిన్న రేకుల షెడ్ వేస్తేనే పీకేసే అధికారులు అధికార పార్టీకి చెందిన నాయకుడు నిర్మిస్తున్న కట్టడానికి మాత్రం ఎటువంటి అనుమతులు లేకపోయినా చూస్తూ ఉండిపోవడం ఈ ప్రాంతంలో విచిత్రంగా మారింది. బఫర్ జోన్ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేయకూడదు.ఏలేరు కెనాల్ కి 100 మీటర్ల దూరంలో ఎలాంటి నిర్మాణాలు చేయకూడదు. అయినప్పటికిని నిబంధనలన్నీ తుంగలోకి తొక్కి అక్రమ నిర్మాణాన్ని కొనసాగిస్తున్నారు. ఇంత జరుగుతున్న అటువైపు కన్నెత్తి చూడడానికి జీవీఎంసీ సిబ్బంది జంకుతున్నారు. ఇటీవల అధికార పార్టీ ఎమ్మెల్యేలు తమ పార్టీ నాయకులు నిబంధనకు విరుద్ధంగా వ్యవహరించిన క్షమించేది లేదని ఊక దంపుడు ప్రచారాలు చేస్తున్నారు. సదర అధికార పార్టీ నాయకుడి అనాధికారి నిర్మాణం పై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి మరి. అధికార పార్టీ ఎమ్మెల్యేలు చెబుతున్నది ప్రచార ఆర్భాటమా లేక చిత్తశుద్ధి ఉందో లేదో అనాధికారి నిర్మాణ విషయంలో తేలిపోనుంది. ఇప్పటికైనా జీవీఎంసీ కమిషనర్ అనధికారి నిర్మాణం పై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# స్వామివారిని దర్శించుకున్న ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు.





**సింహాచలం, పెన్ సత్తా, ఆగస్టు 22:** వరాహ లక్ష్మీనరసింహ స్వామిని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌కు చెందిన ప్రముఖ ప్రతినిధులు దర్శించుకున్నారు. శనివారం పద్మశ్రీ మిథాలీ రాజ్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ మహిళా క్రికెట్ కన్సల్టెంట్, ఎం.ఎస్. కుమార్, జనరల్ మేనేజర్, గేమ్ డెవలప్‌మెంట్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఎన్. గీత, ఛైర్మన్ మహిళా సెలెక్షన్ కమిటీ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, ఆర్. గౌరీ శంకర్, జాయింట్ సెక్రటరీ విశాఖపట్నం జిల్లా క్రికెట్ అసోసియేషన్ శ్రాబణి దేబ్‌నాథ్, హెడ్ కోచ్ సీనియర్ మహిళల జట్టు, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌లు సింహాచల క్షేత్రానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకటరావు కి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ సంప్రదాయానుసారం కప్పస్తం మాలింగనం నిర్వహించి, స్వామివారి సన్నిధికి తీసుకెళ్లారు. వరాహ లక్ష్మీనరసింహస్వామి ని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్న ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులకు ఆలయ పండితులు వేద మంత్రోచ్చారణలతో వేద ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఆలయ ఈఓ స్వామివారి పవిత్ర ప్రసాదాలను అందజేయడంతో పాటు, సింహాచల క్షేత్రానికి వారి దర్శనాన్ని చిరస్మరణీయంగా నిలిపే విధంగా స్వామివారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు సింహాచల క్షేత్ర ఆధ్యాత్మిక వైభవాన్ని, ఆలయ సంప్రదాయాలను అభినందిస్తూ, స్వామివారి ఆశీస్సులు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.

# సింహగిరి పై స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం.

**ఆలయ ఉద్యోగులతో పరిశుభ్రత ప్రతిజ్ఞ చేయించిన ఈఓ జల్లేపల్లి వెంకట్రావు.**




**సింహాచలం, పెన్ సత్తా, ఆగస్టు 22:**రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం సింహాచల సింహగిరి పై ప్రత్యేక శుభ్రత, పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజగోపురం ఎదురుగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో చేపట్టారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భక్తులకు స్వచ్ఛమైన, ఆహ్లాదకర మైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది శ్రమదానం చేశారు.

అనంతరం ఆలయ ఉద్యోగులు, సిబ్బందితో 'స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ' కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఈఓ జల్లేపల్లి వెంకట్రావు, సహాయ కార్యనిర్వహణాధికారి పిల్లా శ్రీనివాసరావు ప్రతిజ్ఞ చేయగా, ఆలయ ఉద్యోగులు, పరిపాలనా విభాగపు పర్యవేక్షణ అధికారి రాజ్యలక్ష్మి, శానిటరీ పర్యవేక్షణ అధికారి ఎస్. కనకరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ సింహాచలం వంటి ప్రముఖ పుణ్యక్షేత్రానికి దేశం నలుమూలల నుంచి భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో ఆలయ పరిసరాల పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. 'స్వచ్ఛతే సేవ –– పరిశుభ్రతే బాధ్యత' అనే స్ఫూర్తితో ప్రతి ఉద్యోగి, సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణ అధికారులు, పర్యవేక్షణ అధికారులు, శానిటరీ విభాగం అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# న్యాయసేతు అనేది ఒక వారధి

స్థిరమైన ఆర్థిక వృద్ధి కేవలం భౌగోళిక లేదా ముడి సహజ వనరులపై మాత్రమే కాకుండా సంస్థాగత స్థిరత్వం, విశ్వాసం, సామర్థ్యంపై ఎక్కువగా ఆధారపడి ఉంటుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. బ్రిక్స్ ప్లస్ దేశాలు మానవాళిలో 40శాతానికి పైగా, ప్రపంచ పీపీపీ ఉత్పత్తిలో దాదాపు 40శాతం వాటాను కలిగి ఉన్నాయని చెప్పారు. వేగవంతమైన ఆర్థిక పురోగతికి పటిష్ఠమైన న్యాయ వ్యవస్థలే వెన్నెముక అని పేర్కొన్నారు. ఈ క్రమంలో చట్టబద్ధమైన పాలనకు సంబంధించిన 'న్యాయనామిక్స్', 'న్యాయసేతు' అనే పదాలను పరిచయం చేశారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ శనివారం దిల్లీలో జరిగిన 11వ బ్రిక్స్ ప్లస్ లీగల్ ఫోరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 'న్యాయ సేతు' (న్యాయ వారధి), 'న్యాయఆర్థిక శాస్త్రం' (న్యాయనామిక్స్) అనే కాన్సెప్ట్‌లను పరిచయం చేశారు. బ్రిక్స్ ప్లస్ దేశాలలో చట్టపరమైన, ఆర్థిక శక్తిని ఏకీకృతం చేసేందుకు 'న్యాయనామిక్స్', 'న్యాయ సేతు' దార్శనికత గురించి వివరించారు. 'బహుధ్రువ ప్రపంచంలో చట్టబద్ధ పాలన' అనే అంశంపై జరిగిన ప్రారంభ ప్లీనరీలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. "చట్టబద్ధమైన పాలన గురించి నేను ఒక పదాన్ని ఉదహరిస్తున్నాను. అదే న్యాయనమిక్స్. మరింత సరళంగా చెప్పాలంటే న్యాయ ఆర్థిక శాస్త్రం. ఈ న్యాయనామిక్స్ బ్రిక్స్ ప్లస్ దేశాలన్నింటికీ వర్తిస్తుంది. కేసులను డిజిటలైజ్ చేయడంలో భారతదేశానికి ఉన్న అనుభవాన్ని ఆధారంగా చేసుకుని, న్యాయశాస్త్రానికి సంబంధించిన ఒక ఉమ్మడి భాండాగారాన్ని ఏర్పాటు చేయాలి. తద్వారా బ్రిక్స్ ప్లస్ దేశాల అధికార పరిధిలో



వెలువడిన తీర్పు, అదే విధమైన చట్టపరమైన ప్రశ్నలతో వ్యవహరించే ఇతర ప్రాంతాలలోని న్యాయస్థానాలకు మార్గదర్శకంగా ఉపయోగపడుతుంది. తద్వారా దిల్లీ, బ్రసీలియాలో రాసిన తీర్పు అదే ప్రశ్నను ఎదుర్కొంటున్న మరోచోట ఉన్న ధర్మాసనానికి తెలియజేయడానికి సంవత్సరాల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేదు. 'న్యాయ సేతు' అనేది 11 న్యాయ సంప్రదాయాలను అనుసంధానించే ఒక వారధి."

### 'బ్రిక్స్ పరస్పర సహకారం కోసం మరింత విస్తృతమైన వేదికగా ఎదిగింది'

బ్రిక్స్ దేశాల మధ్య బలమైన న్యాయ సహకారం అవసరాన్ని బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు ఎస్.ఎస్. నాగానంద్ కూడా నొక్కి చెప్పారు. బ్రిక్స్ ఏర్పడినప్పుడు దాని ప్రధాన దృష్టి సభ్య దేశాల మధ్య ఆర్థిక, ద్రవ్య సహకారాన్ని బలోపేతం చేయడంపైనే ఉందని పేర్కొన్నారు. సంవత్సరాలుగా బ్రిక్స్ పరస్పర సహకారం, భాగస్వామ్యం కోసం మరింత విస్తృతమైన వేదికగా ఎదిగిందని గుర్తు చేసుకున్నారు. దీంతో ఆర్థిక సంబంధాలతో పాటు చట్టపరమైన సంబంధాలు కూడా అనివార్యంగా బలపడతాయని తెలిపారు. "బ్రిక్స్ న్యాయ వేదికను స్థాపించడం, అభివృద్ధి చేయడం చాలా అవసరం. ఇలా చేస్తే సమస్యలను సమష్టిగా పరిశీలించడానికి, ఒకరి న్యాయ వ్యవస్థలను మరొకరు అర్థం చేసుకోవడానికి, ఒకరి అనుభవాల నుంచి మరొకరు నేర్చుకోవడానికి, అలాగే మన దేశాల మధ్య ఉన్న వివాదాలకు పరిష్కారాన్ని ఎలా సరళంగా, మరింత ప్రభావవంతంగా కనుక్కోవచ్చో అన్వేషించడానికి ఒక అద్భుతమైన అవకాశం లభిస్తుంది. ఈ మారుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని దిల్లీలో ఒక బ్రిక్స్ మధ్యవర్తిత్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చొరవ తీసుకుంది."

### భారత్ అధ్యక్షతన బ్రిక్స్ సదస్సు

2012, 2016, 2021లలో భారత్ బ్రిక్స్ సదస్సుకు అధ్యక్షత వహించింది. 2026లో నాలుగోసారి ఈ శిఖరాగ్ర సదస్సుకు అధ్యక్షత వహించనుంది. ఈ నేపథ్యంలో ప్రముఖ న్యాయ ప్రముఖుల నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. 'స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం' అనే ఇతివృత్తంతో ఇండియా బ్రిక్స్ సదస్సుకు అధ్యక్షత వహించనుంది. కాగా, బ్రిక్స్ కూటమిలో 2024లో ఇరాన్‌తోపాటు ఈజిప్టు, ఇథియోపియా, యూఏఈ దేశాలు చేరాయి. 2025లో ఇండోనేసియా కూడా బ్రిక్స్ కూటమిలో భాగమైంది. దీంతో ప్రస్తుతం పూర్తిస్థాయి బ్రిక్స్ సభ్యదేశాల సంఖ్య 11కు చేరుకుంది.

# విమాన ప్రయాణికులకు బిగ్ రిలీఫ్

సెప్టెంబర్ 1 నుంచి భారత విమానాశ్రయాల నుంచి బయలుదేరే అంతర్జాతీయ ప్రయాణికులు తమ బోర్డింగ్ పాస్‌లపై ఇమ్మిగ్రేషన్ అధికారులతో భౌతికంగా స్టాంప్ వేయించుకోవాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. స్టాంపింగ్‌కు బదులుగా విదేశాలకు ప్రయాణించే ప్రయాణికులు ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ కోసం తమ స్మార్ట్‌ఫోన్‌లోని ఈ-బోర్డింగ్ పాస్‌ను చూపించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అయితే ప్రయాణికులు ఫిజికల్ బోర్డింగ్ పాస్‌లను తీసుకురావొచ్చని, కానీ ఇమ్మిగ్రేషన్ అధికారులు వాటిపై స్టాంప్ వేయరని పేర్కొంది. ఈ మేరకు సంబంధిత అధికారులు వెల్లడించారు.

### ప్రయాణికుల అసౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని!

ఫిజికల్ బోర్డింగ్ పాస్‌లు సమర్పించే విషయంలో ప్రయాణికులకు అసౌకర్యం కలుగుతోందని, ఒక్కోసారి స్టాంపింగ్ తప్పిదాల వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ తెలియజేయడంతో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అధికారులు తెలిపారు. దేశంలోని అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాలలో భౌతిక బోర్డింగ్ పాస్‌ల తప్పనిసరి అవసరాన్ని, ఇమ్మిగ్రేషన్ కౌంటర్ల వద్ద బోర్డింగ్ పాస్‌లపై స్టాంపింగ్‌ను తొలగించాలని కేంద్రం తాజాగా నిర్ణయించిందని పేర్కొన్నారు. ప్రయాణికుల తనిఖీ సమయంలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) కూడా బోర్డింగ్ పాస్‌లపై స్టాంపులు వేయదని స్పష్టం చేశారు. వాటిని కేవలం ఇమిగ్రేషన్ అధికారుల క్లియరెన్స్ కోసం మాత్రమే చూపించాల్సి ఉంటుందని వెల్లడించారు. భారత పాస్‌పోర్ట్ ఉన్న పౌరులకు కూడా బోర్డింగ్ పాస్‌లపై స్టాంపింగ్ తొలగింపు విషయంలో పైలట్ ప్రాజెక్ట్ చేపట్టినట్లు వివరించారు.

### కేంద్ర సర్కార్ కొత్త రూల్స్ ప్రకారం

భారత్ నుంచి బయలుదేరే ప్రయాణికులు ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ సమయంలో తమ స్మార్ట్‌ఫోన్‌లో ఉన్న ఈ-బోర్డింగ్ పాస్‌లను చూపించవచ్చు. అలా అని ఫిజికల్ బోర్డింగ్ పాస్‌లను కలిగి ఉన్న ప్రయాణికులకు బోర్డింగ్ క్లియరెన్స్‌ను ఇస్తారు. అయితే సెప్టెంబర్ 1 నుంచి ఇమ్మిగ్రేషన్ అధికారులు ఫిజికల్ బోర్డింగ్ పాస్‌లపై స్టాంపులు వేయరు. కాగా, సీఐఎస్ఎఫ్ కొన్నేళ్ల క్రితమే దేశీయ, అంతర్జాతీయ ప్రయా



ణికుల బోర్డింగ్ పాస్‌లపై స్టాంపులు వేయడాన్ని ఆపేసింది.

### మరో కీలక చర్యకు సిద్ధమవుతోందా?

అలాగే అంతర్జాతీయ ప్రయాణికులకు మరింత సౌకర్యం కల్పించే దిశగా బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ మరో కీలక చర్యకు రెడీ అవుతోంది. భారతీయ పాస్‌పోర్ట్ కలిగిన ప్రయాణికుల రాకపోకల సమయంలో పాస్‌పోర్ట్‌లపై స్టాంపింగ్ వేసే విధానాన్ని కూడా పూర్తిగా తొలగించేందుకు సిద్ధమవుతోంది. దీనికి సంబంధించి త్వరలోనే ఒక పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించి, ఆ తర్వాత దేశంలోని అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో అమలు చేయనుంది.

### పాస్‌పోర్టు ఫీజుల పెంపు

కాగా, పాస్‌పోర్ట్ ఫీజులను కేంద్ర ప్రభుత్వం ఇటీవల సవరించింది. 36 పేజీలతో కూడిన పాస్‌పోర్ట్ రుసుమును రూ.1500 నుంచి రూ.2,500 పెంపు చేసింది. తత్కాల్ ఫీజును రూ.3,500 నుంచి రూ.5 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 60 పేజీల పాస్‌పోర్ట్‌కు ప్రస్తుతం రూ.2వేల ఫీజు కాగా, ఇక నుంచి రూ.3500 వసూలు చేయనుంది. అదే తత్కాల్ ఫీజును రూ.6వేలుగా నిర్ణయించింది. 18 ఏళ్ల కన్నా తక్కువ వయసున్న దరఖాస్తుదారులకు కొత్త పాస్‌పోర్ట్ రుసుము ప్రస్తుతం రూ.1000 ఉండగా, అది రూ.1750కి పెరిగింది. దాదాపు 14 ఏళ్ల తర్వాత పాస్‌పోర్ట్ ఫీజులు పెరిగాయి.

### ఇండియా పాస్‌పోర్ట్ ప్రయాణ పత్రం మాత్రమే : కేంద్ర విదేశాంగ శాఖ స్పష్టం

భారత పాస్‌పోర్ట్ ప్రధానంగా ప్రయాణ పత్రం మాత్రమేనని, అది పౌరసత్వానికి తుది ఆధారం కాదని కేంద్ర విదేశాంగ శాఖ ఇటీవలే స్పష్టం చేసింది. గత 12 ఏళ్లలో పాస్‌పోర్ట్‌ను పౌరసత్వ ధ్రువీకరణ పత్రంగా ఎప్పుడూ ప్రకటించలేదని పేర్కొంది. దీనికి ఆధారంగా పాస్‌పోర్ట్ చట్టం-1967లోని సెక్షన్-20ను ప్రస్తావించింది. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అవసరమైతే భారత పౌరుడు కాని వ్యక్తికీ కూడా కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్ట్ లేదా ప్రయాణ పత్రాన్ని జారీ చేయవచ్చని ఆ సెక్షన్‌లో స్పష్టంగా పేర్కొన్నట్లు తెలిపింది. ఈ నిర్ణయంపై అప్పట్లో మోదీ ప్రభుత్వంపై విపక్షాలు భగ్గుమన్నాయి.

# వందేమాతరంపై దేశవ్యాప్తంగా కార్యక్రమాలు

వందేమాతరం విషయంలో కాంగ్రెస్ "బుజ్జగింపు రాజకీయాలకు" పాల్పడుతోందని బీజేపీ శనివారం ఆరోపించింది. రాజ్యాంగం, పార్లమెంట్ చేసిన చట్టాల కంటే ఏ పార్టీ లేదా వ్యక్తి గొప్పవారు కాదని స్పష్టం చేసింది. వందేమాతరం గేయంలోని కేవలం రెండు చరణాలను మాత్రమే పాడాలన్న కాంగ్రెస్ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ బీజేపీ ఓ తీర్మానాన్ని ఆమోదించింది. రాజకీయ ప్రయోజనాల కోసం లేదా బుజ్జగింపుల కోసం జాతీయ గేయం గౌరవం విషయంలో ఎలాంటి రాజీని అంగీకరించబోమని స్పష్టం చేసింది. దిల్లీలో బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ అధ్యక్షతన జరిగిన పార్టీ నూతన పదాధికారుల సమావేశంలో ఈ మేరకు తీర్మానం ఆమోదించారు. వందేమాతరం ఘనమైన వారసత్వాన్ని దేశం నలుమూలలా వ్యాప్తి చేయడానికి ఒక భారీ ప్రచారాన్ని ప్రారంభిస్తామని బీజేపీ పేర్కొంది.

ఈ తీర్మానానికి సంబంధించిన వివరాలను నితిన్ నబీన్ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. వందేమాతరాన్ని "స్వచ్ఛమైన జాతీయ భావానికి, సామ్రాజ్యవాద వ్యతిరేక నినాదంగా అభివర్ణించిన మహాత్మా గాంధీ ప్రకటనను పెద్దఎత్తున ప్రజల్లోకి తీసుకువెళ్తామని ఆయన పేర్కొన్నారు. ఆరు చరణాలతో కూడిన సంపూర్ణ జాతీయ గేయాన్ని, వందేమాతరంతో ముడిపడిన దేశ స్వాతంత్ర్య పోరాట జ్ఞాపకాలను యువత అర్థం చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపడతామని నబీన్ వివరించారు.

"2026 ఆగస్టు 22న వందేమాతరం పట్ల గౌరవం, దాని చారిత్రక వారసత్వ పరిరక్షణకు సంబంధించి ఒక ముఖ్యమైన తీర్మానాన్ని భారతీయ జనతా పార్టీ ఆమోదించింది. కాంగ్రెస్ కార్యక్రమాల్లో వందేమాతరం గీతాన్ని మొదటి రెండు చరణాలకే పరిమితం చేస్తూ 1937లో తీసుకున్న నిర్ణయాన్ని పునరుద్ఘాటిస్తూ, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆగస్టు 19, 2026న తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోంది. రాజకీయ



ప్రయోజనాలు లేదా బుజ్జగింపుల కోసం వందేమాతరం గౌరవం, వారసత్వం విషయంలో ఎటువంటి రాజీని అంగీకరించబోము. వందేమాతరం సంపూర్ణ గేయ గౌరవం, హుందాతనం, వారసత్వం, జాతీయ స్ఫూర్తిని బీజేపీ కాపాడుతుంది. అలాగే, వందేమాతరాన్ని అత్యంత స్వచ్ఛమైన జాతీయ భావనతో ముడిపడి ఉన్న "సామ్రాజ్యవాద వ్యతిరేక నినాదం"గా అభివర్ణిస్తూ మహాత్మా గాంధీ చేసిన వ్యాఖ్యలను కూడా బీజేపీ ప్రజల్లోకి తీసుకెళ్తుంది. వందేమాతరం చరిత్ర, అర్థం, జాతీయ ప్రాముఖ్యత, వారసత్వాన్ని భారతదేశంలోని ప్రతి మూలకు చేరవేసేందుకు బీజేపీ ఒక ప్రచారాన్ని ప్రారంభిస్తుంది. అంతేకాకుండా, వందేమాతరం ఆలపించడంపై ఆంక్షలు విధించిన చారిత్రక, రాజకీయ పరిస్థితులను అంటే ముస్లిం లీగ్ అభ్యంతరాలు, తదనంతరం పెరిగిన మతపరమైన, వేర్పాటువాద డిమాండ్ల రాజకీయాలను ప్రజలకు వివరించాలని పార్టీ నిర్ణయించింది. 1947లో భారతదేశ స్వాతంత్ర్య విజయ నినాదం 'వందేమాతరం'. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 2047 నాటి 'అభివృద్ధి చెందిన భారతదేశం' (వికసిత్ భారత్) గొప్ప ప్రకటనకు కూడా 'వందేమాతరం' నినాదమే కానుంది."

కాంగ్రెస్ పార్టీ లేదా దాని వర్కింగ్ కమిటీ గానీ తమను తాము పార్లమెంట్ కంటే గొప్పగా భావించకూడదని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి, ఎంపీ సంబిత్ పాత్ర అన్నారు. "ఈ రోజు నేను దేశాన్ని అడగదలుచుకున్నాను. పార్లమెంట్ గొప్పదా లేక జఔజ గొప్పదా? దేశం పార్లమెంట్‌లో తీసుకున్న నిర్ణయాల ఆధారంగా నడుస్తుందా లేక జఔజ ఆమోదించిన నిర్ణయాలు, తీర్మానాల ఆధారంగా నడుస్తుందా? ఏ కుటుంబం, ఏ రాజకీయ పార్టీ, ఏ వ్యక్తి కూడా దేశ చట్టం, దేశ రాజ్యాంగం, పార్లమెంట్ చేసిన చట్టాల కంటే తాము గొప్పవారమని భావించకూడదు. జఔజ తన కార్యాలయంలో కూర్చుని, తమను తాము పార్లమెంట్ కంటే గొప్పగా భావించకూడదు. పార్లమెంట్ ప్రజాస్వామ్యానికి అత్యున్నత దేవాలయం. పార్లమెంట్‌లో తీసుకున్న నిర్ణయమే దేశ నిర్ణయం. వందేమాతరం దేశ గేయం. అది దేశ మంత్రం. హిందువులు, ముస్లింల మధ్య విభజన సృష్టించడానికి ఇది ఒక సాధనం కాదు. కాంగ్రెస్ విభజన బీజాలు నాటడానికి ప్రయత్నిస్తోంది. దీన్ని మేము జరగనివ్వము." అని సంబిత్ పాత్ర అన్నారు.

## న్యాయమూర్తులు దేవుళ్లు కాదు

'న్యాయమూర్తులు దేవుళ్లు కాదు. ప్రతి తీర్పునూ కచ్చితంగా సరైనదిగా ఇవ్వలేం' అని సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ అన్నారు. న్యాయవ్యవస్థలో వినయం, బాధ్యత, మానవీయ కోణం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. శనివారం సుప్రీంకోర్టులో తన చివరి పని రోజున ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా భావోద్వేగంతో కీలక వ్యాఖ్యలు చేశారు. 'రాజ్యాంగం, న్యాయమూర్తులు కేవలం చట్టాన్ని సరిగ్గా వర్తింపజేయాలని మాత్రమే కోరడం లేదు. చట్టాన్ని న్యాయబద్ధంగా అమలు చేయడం కూడా అంతే ముఖ్యం. కోర్టుకు వచ్చే ప్రతి వ్యక్తిని కేవలం పిటిషనర్‌గా కాకుండా ఒక మనిషిగా చూడాల్సిన అవసరం ఉంది. ఒక పిటిషన్ కేసుకు సంబంధించిన వాస్తవాలను మాత్రమే చెబుతుంది. కానీ కోర్టును ఆశ్రయించిన వ్యక్తి ఇప్పటికే ఏం కోల్పోయాడు? తనకు కోర్టు నుంచి ఏం ఆశిస్తున్నాడు? వంటి విషయాలను అది చెప్పదు. అందుకే న్యాయమూర్తికి వినయం అవసరం' అని జస్టిస్ కరోల్ తెలిపారు.

### 'కోర్టులో మాటలే కాదు, మౌనం కూడా ముఖ్యం'

దాదాపు నాలుగు దశాబ్దాల తన న్యాయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్నారు జస్టిస్ కరోల్. సుమారు 40 ఏళ్లపాటు కోర్టు గదుల్లో గడిపినట్లు తెలిపారు. తొలుత న్యాయవాదిగా, ఆ తర్వాత 19 ఏళ్లపాటు న్యాయమూర్తిగా సేవలందించానని చెప్పారు. కోర్టులో వినిపించే వాదనలతో పాటు మౌనంలో దాగి ఉన్న మాటలను కూడా న్యాయమూర్తులు అర్థం చేసుకోవాలని అన్నారు. న్యాయ ప్రక్రియలో న్యాయవాదులు చేసే వాదనలే కాకుండా, మాటల మధ్యలో బాధితులు కోరుకునేది ఏమిటో గుర్తించడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. 1996లో తొలిసారి సుప్రీంకోర్టు మొదటి నంబర్ కోర్టులోకి వెళ్లిన గుర్తు చేస్తూ, అప్పట్లో న్యాయమూర్తుల బెంచ్ దాదాపు ఆరు అడుగుల ఎత్తులో ఉన్నట్లు తనకు అనిపించిందన్నారు. కింద నుంచి చూస్తే ఆ ఎత్తు అధికారానికి ప్రతీకగా కనిపించవచ్చుని, కానీ న్యాయమూర్తిగా ఆ స్థానంలో కూర్చున్నప్పుడు అది గౌరవం, నిజాయితీతో కూడిన బాధ్యతకు ప్రతీక అని అర్థమైందన్నారు.

### సాధారణ పౌరుడి విశ్వాసమే సుప్రీంకోర్టు బలం

సుప్రీంకోర్టు గొప్పతనం కేవలం కీలకమైన కేసుల్లో వెలువడే తీర్పుల్లో లేదని జస్టిస్ కరోల్ అన్నారు. న్యాయం జరుగుతుందనే నమ్మకంతో కోర్టు గడప తొక్కే సాధారణ పౌరుడి విశ్వాసమే దాని అసలైన బలమని పేర్కొన్నారు. అయితే న్యాయం చాలా దూరంగా ఉందని, ఖరీదైనదని లేదా భయపెట్టేదిగా భావించి కోర్టుల గడప తొక్కలేని వారిని కూడా గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చట్టం, న్యాయ ప్రక్రియ, రాజ్యాంగబద్ధత వంటి భావనలను అర్థం చేసుకోవడానికి ధర్మం అనే భావనను ఉదాహరణగా తీసుకోవచ్చని జస్టిస్ కరోల్ అన్నారు. ఇక్కడ ధర్మం అంటే ఆచారం కాదని, విధి, బాధ్యత అని వివరించారు. కోర్టు ముందు నిలబడే వ్యక్తి ఎంత చిన్నవాడైనా, ఎంత దుర్భర పరిస్థితుల్లో ఉన్నా అతడి మాటను న్యాయమూర్తి వినాలని చెప్పారు. న్యాయం పట్ల నిబద్ధతతో వ్యవహరించడమే న్యాయమూర్తి ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు.

### 'ప్రతి ఒక్కరూ తమ నిర్ణయాలకు న్యాయమూర్తులే'

న్యాయవ్యవస్థలోని బాధ్యతలు కేవలం కోర్టు గదులకే పరిమితం కావని జస్టిస్ కరోల్ అన్నారు. ప్రతి వ్యక్తి తన నిర్ణయాలు, ప్రవర్తన, అధికార వినియోగంపై తానే న్యాయమూర్తిగా వ్యవహరించాల్సి ఉంటుందని సూచించారు. 'న్యాయమూర్తి వస్త్రాలు ధరించే ముందు కూడా న్యాయమూర్తే. వాటిని తొలగించిన తర్వాత కూడా న్యాయమూర్తే' అని ఆయన వ్యాఖ్యానించారు. భారత్?కు కేవలం ఒక రాజ్యాంగం ఉండటమే కాదు, దానిని మన జీవితాల్లో ఆచరించాల్సిన అవసరం ఉందని జస్టిస్ కరోల్ అన్నారు. రాజ్యాంగం గొప్పతనం పెద్ద పెద్ద కేసుల్లోనే పరీక్షకు గురికాదని, సాధారణ పౌర జీవితంలోని ప్రతి చర్యలోనూ అది ప్రతిబింబించాలని పేర్కొన్నారు.

## 'ఇది ఎలాంటి 'ఆత్మనిర్భర్ భారత్'




దేశీయ మార్కెట్లో చక్కెర ధరల పెరుగుదల, కొరత నేపథ్యంలో కేంద్రం తీరుపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. మోదీ ప్రభుత్వం విధానాల వల్ల పండుగల సీజన్‌కు ముందే సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని ఆరోపించింది. 'మోదీ ప్రభుత్వ విధానాల్లోని చేదు, చక్కెరలోని మాధుర్యానికి పాకింది' అని కాంగ్రెస్? జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, ఆయన శనివారం చేసిన ఎక్స్‌లో ఒక పోస్టు పలు ప్రశ్నలు సంధించారు. "మోదీ ప్రభుత్వానికి నేను సూటిగా మూడు ప్రశ్నలు అడుగుతున్నా. ప్రపంచంలోనే అతిపెద్ద చక్కెర ఉత్పత్తిదారు, ఎగుమతిదారు అయిన భారతదేశంలో, చక్కెర నిల్వలు గత 9 ఏళ్లలో ఎన్నడూ లేనంత కనిష్ఠ స్థాయికి ఎందుకు పడిపోయాయి? ఎగుమతులను నిలిపివేసి, 10 లక్షల టన్నుల చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకునే స్థాయికి మనం ఎలా చేరుకున్నాం?. ఇక రెండోది, మూడు నెలల్లో చక్కెర ధర దాదాపు 40 శాతం పెరిగింది. పండుగలకు ముందు ప్రజలపై ఇంత భారం మోపుతున్న ఈ ధరల పెరుగుదలకు ఎవరు బాధ్యులు? మూడోది, దేశంలో చక్కెర కొరత ఉన్నప్పుడు, ప్రభుత్వం విదేశాల నుంచి చక్కెరను దిగుమతి చేసుకుంటున్నప్పుడు, ఈ20 కోసం ఇథనాల్ ఉత్పత్తి చేయడానికి చెరకు, ధాన్యాన్ని మళ్లించే విధానాన్ని ఎందుకు సమీక్షించడం లేదు? ఇది ఎలాంటి 'ఆత్మనిర్భర్ భారత్'?"

### 'ధరలు పెరగడానికి ఇథనాల్ కారణం కాదు'

కాగా, దేశంలో చక్కెర ధరలు పెరగడానికి ఇథనాల్ కారణమని వస్తున్న ఆరోపణలను వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ ఖండించింది. జులై 20న కిలోకు రూ. 48గా ఉన్న చక్కెర ధరలు ఆగస్టు 20 నాటికి కిలోకు రూ. 55కి పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయని, ఇథనాల్ మళ్లింపు కాదని స్పష్టం చేసింది. ఇథనాల్ కోసం మళ్లించిన చక్కెర వాటా 2022-23లో సుమారు 12 శాతం నుంచి 2025-26 నాటికి సుమారు 9 శాతానికి తగ్గిందని తెలిపింది. అదే సమయంలో దేశంలోని మొత్తం ఇథనాల్ ఉత్పత్తిలో దాదాపు ముప్పావు వంతు ధాన్యాల నుంచి, ముఖ్యంగా మొక్కజొన్న నుంచి వస్తోందని వివరించింది. ఊహించిన దానికంటే తక్కువ దేశీయ ఉత్పత్తి, పండుగ సీజన్‌కు ముందు పెరిగిన డిమాండ్, వాతావరణ సంబంధిత కారణాల వల్ల ధరలు పెరిగాయని ప్రభుత్వం పేర్కొంది. అదే సమయంలో దేశీయ వినియోగానికి సరిపడా చక్కెర నిల్వలు అందుబాటులో ఉన్నా, కృత్రిమ కొరత సృష్టిస్తూ మిల్లర్లు, వ్యాపారులు ధరలను అడ్డగోలుగా పెంచారని కేంద్రం ఆగ్రహం వ్యక్తం చేసింది. నిల్వదారులు, బ్లాక్ మార్కెటర్లు, స్పెక్యులేటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. మార్కెట్‌లో చక్కెర కొరతను నివారించేందుకు కేంద్రం ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. చక్కెర సరఫరా పెంచడం, కృత్రిమ కొరతను నివారించడం, ధరల పెరుగుదలకు అడ్డుకట్ట వేసేందుకు వీలుగా నిల్వలపై ఆంక్షలు విధిస్తూ నిర్ణయం తీసుకుంది. నెలకు 10 మెట్రిక్ టన్నుల కంటే ఎక్కువ విక్రయించే, వినియోగించే పెద్ద వ్యాపారులు, పరిశ్రమలు తమ వద్ద 15 రోజులకు సరిపడా నిల్వలనే ఉంచుకోవాలని ఆదేశించింది. మిఠాయిలు, ఇతర పదార్థాలు, శీతల పానీయాల తయారీదారులు, ఆహారశుద్ధి యూనిట్లు, అమ్మకం దారులు, ఇతర సంస్థాగత కొనుగోలుదారులపై ఈ ఆంక్షలు విధించింది. నవంబరు 30 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని కేంద్రం తెలిపింది. చక్కెర కొరత రాకుండా ముడి పంచదారను 10 లక్షల టన్నుల మేర అక్టోబరు 31 లోపు దిగుమతి చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. గతేడాది ఇదే సమయంలో టన్ను 3 వేల 900 రూపాయులగా ఉన్న పంచదార ధర ఇప్పుడు 5,400 - 5,500 స్థాయికి చేరిన నేపథ్యంలో కేంద్రం ఈ చర్యలు తీసుకుంది. దాదాపు పదేళ్ల తర్వాత విదేశాల నుంచి చక్కెర దిగుమతులకు కేంద్రం అవకాశం కల్పించడం గమనార్హం.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
ప్రశ్నించడం అందరి హక్కు..
PEN SATTA Telugu Daily
ఆదివారం 23 ఆగస్టు 2026

చొచ్చుకొస్తోన్న కృత్రిమ మేధ .. చదువు నేర్పు విధానాన్నీ వేగంగా మారుస్తోంది. సో, స్కూళ్లు, కాలేజీలను పాఠాల చోటుగాకాకుండా, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే చోటుగా చూడాలి. కంప్యూటర్లు, ఇంటర్నెట్, స్మార్ట్ యాప్‌లు పిల్లలు ఎలా నేర్చుకుంటారో, ప్రపంచాన్ని ఎలా అర్థం చేసుకుంటారో మార్చేస్తున్నాయి. దీంతో ఒక పెద్ద ప్రశ్న తలెత్తుతోంది. చదువు అంటే ఉద్యోగం కోసం టెక్నికల్ స్కిల్స్ నేర్పించడమేనా? లేక పిల్లలను ఆలోచించేలా, మంచి–చెడు తేడా తెలుసుకునేలా కూడా తీర్చిదిద్దాలా? దీనికి సమాధానంగా, మన దేశంలో జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) 2020 తీసుకొచ్చారు. ఇది పిల్లలు ఒకే సబ్జెక్టుకు కట్టుబడిపోకుండా, వేర్వేరు సబ్జెక్టులను కలిపి నేర్చుకునే వెసులుబాటు ఇస్తుంది. మూడేళ్లు లేదా నాలుగేళ్ల డిగ్రీ కావాలా అన్నది పిల్లలే ఎంచుకోవచ్చు. మధ్యలో చదువు ఆపేసినా, ఆ వరకూ నేర్చుకున్నదానికి సర్టిఫికెట్ ఇచ్చే వెసులుబాటు కూడా ఇందులో ఉంది. చదువు అంటే కేవలం ఉద్యోగం సంపాదించడం మాత్రమే కాదని, సొంతగా ఆలోచించగలిగే, బాగా మాట్లాడగలిగే, సమాజానికి ఉపయోగపడే మనుషులను తయారు చేయడం కూడా చదువు లక్ష్యమని ఈ విధానం చెబుతోంది. దీంతో, పిల్లలకు సమాచారం అందించడమే కాదు, ఆ సమాచారాన్ని సరిగ్గా అర్థం చేసుకోవడం, దాన్ని ప్రశ్నించడం, సరైన రీతిలో వాడుకోవడం కూడా నేర్పించాల్సిన అవసరముంది. ఏఐ మనుషుల స్థానాన్ని ఆక్రమించకూడదు, మనుషుల సామర్థ్యాన్ని పెంచడానికే ఉపయోగపడాలి. అందుకే, ఏది నిజమో ఏది అబద్ధమో గుర్తించగలగడం, లోతుగా ఆలోచించగలగడం, మంచి ప్రశ్నలు అడగగలగడం ఇప్పుడు మరింత విలువైనవిగా మారుతున్నాయి. కేవలం కంప్యూటర్ నాలెడ్జ్ ఉంటే సరిపోదు, సమాచారాన్ని జాగ్రత్తగా పరిశీలించడం, కొత్త ఆలోచనలు తేవడం, ఇతరులతో కలిసి పనిచేయడం, మానవత్వంతో కూడిన సమస్యా పరిష్కారం చేయగలగడం కూడా అవసరం. చదువులో టెక్నికల్ సబ్జెక్టులతోపాటు, చరిత్ర, తత్వశాస్త్రం, రాజకీయ శాస్త్రం, సమాజశాస్త్రం లాంటి సబ్జెక్టులను కూడా కలిపి నేర్పిస్తే, పిల్లలు ఏదైనా విషయాన్ని ప్రశ్నించడం, ఆధారాలను పరిశీలించడం, సమాజంలోని సంక్లిష్టతలను అర్థం చేసుకోవడం నేర్చుకుంటారు. ఇలాంటి నైపుణ్యాలను కేవలం మెషిన్లు, కంప్యూటర్లు నేర్పించలేవు. ఫేక్ న్యూస్, డీప్‌ఫేక్ వీడియోలు ఎక్కువగా వ్యాప్తి చెందుతున్న ఈ కాలంలో, ఏది నిజమో ఏది కాదో గుర్తించే శక్తిని ఇలాంటి చదువే ఇస్తుంది. చుట్టూ ఉన్నవారు ఏం చెబితే అది గుడ్డిగా నమ్మేయడం కాకుండా, సొంతంగా ఆలోచించి నిర్ణయం తీసుకునే గుణాన్ని కూడా ఈ చదువు నేర్పిస్తుంది. నిజమైన చదువు అంటే పిల్లల్లో దాగివున్న ప్రతిభను వెలికితీయడం. కేవలం బట్టీ పట్టడం కాకుండా, జ్ఞానం, నైపుణ్యాలు, మంచి విలువలు కూడా నేర్పించాలని యూజీసీ కూడా చెబుతోంది.

ప్రశ్నించడం, ఆధారాలతో ఆలోచించడం నేర్పిస్తే, పిల్లలు సమాచారాన్ని సరిగ్గా అర్థం చేసుకుని, సమాజంపై నమ్మకాన్ని పెంచుకుంటారు. సైన్స్‌తోపాటు మానవీయ శాస్త్రాలను కూడా కలిపి నేర్పిస్తే, పిల్లలు సంక్లిష్టమైన విషయాలను అర్థం చేసుకోగలుగుతారు. ఏది సరైనదో ఏది కాదో నిర్ణయించుకోగలుగుతారు. చదువు లక్ష్యం కేవలం జ్ఞానం సంపాదించడం మాత్రమే కాదు, బాగా చదవడం, స్పష్టంగా రాయడం, విశాలంగా ఆలోచించడం, తెలివిగా వ్యవహరించడం కూడా. ఈనాటి

## జ్ఞానానికి కొత్త దిక్సూచి!

సవాళ్లను ఎదుర్కోవాలంటే కేవలం సాంకేతిక జ్ఞానం సరిపోదు, కుతూహలంతో ప్రశ్నించే మనస్తత్వం కావాలి. చరిత్ర సబ్జెక్టు ఆధారాల ప్రాముఖ్యతను నేర్పిస్తుంది. ఏదైనా విషయాన్ని అర్థం చేసుకోవాలంటే దాని వెనుక ఉన్న నేపథ్యం, సందర్భం తెలుసుకోవాలని చెబుతుంది. తత్వశాస్త్రం ఆలోచనా శక్తికి పదును పెడుతుంది. తప్పుడు వాదనలను గుర్తించడం నేర్పిస్తుంది. రాజకీయ శాస్త్రం ప్రభుత్వ వ్యవస్థలు, అధికారం ఎలా పనిచేస్తాయో వివరిస్తుంది. సాహిత్యం ఇతరుల బాధను అర్థం చేసుకునే గుణాన్ని, వేర్వేరు దృక్కోణాల నుంచి విషయాలను చూసే సామర్థ్యాన్ని పెంచుతుంది. సమాజశాస్త్రం మనుషుల ప్రవర్తనను సంస్కృతి, సంప్రదాయాలు ఎలా ప్రభావితం చేస్తాయో చూపిస్తుంది. ఇవన్నీ కలిసి, పిల్లలు ప్రశ్నించడం, సరైనదేదో నిర్ణయించుకోవడం, సంక్లిష్ట విషయాలను అర్థం చేసుకోవడం నేర్చుకుంటారు. సరైన నిర్ణయం తీసుకునే జ్ఞానమే మనిషికి అతిపెద్ద బలంగా మిగిలిపోతుంది. ఇది వ్యక్తులు నైతిక తీర్పులు తీసుకోవడానికి, సొంత ఆలోచనలను కాపాడుకోవడానికి, సమాచారాన్ని విమర్శనాత్మకంగా చూడటానికి, ప్రజాస్వామ్య ప్రక్రియల్లో బాధ్యతగా పాల్గొనడానికి తోడ్పడుతుంది.

## సంపాదకీయం

ఇప్పుడు జ్ఞానం అందరికీ సులభంగా అందుబాటులో ఉంది. కాబట్టి చదువు పిల్లలను ప్రపంచస్థాయిలో ఆలోచించేలా తీర్చిదిద్దాలి. నేటి పిల్లలు కృత్రిమ మేధతోపాటు సాంఘిక శాస్త్రాలను, డేటా సైన్స్‌తోపాటు మనస్తత్వశాస్త్రాన్ని కలిపి నేర్చుకుంటున్నారు. పర్యావరణ సమస్యలను సైన్స్ కోణంలోనూ, చరిత్ర కోణంలోనూ, సమాజం కోణంలోనూ అర్థం చేసుకుంటున్నారు. ఇలాంటి విద్య టెక్నికల్ నైపుణ్యంతోపాటు, మానవత్వం, మంచి తీర్పు, సృజనాత్మకత, మారుతున్న పరిస్థితులకు తగినట్టు మారగల గుణంలాంటి లక్షణాలను పెంచుతుంది. డేటా సైన్స్ తెలిసిన తత్వవేత్త ఈనాటి సమస్యలను బాగా అర్థం చేసుకోగలడు. ఏఐ గురించి తెలిసిన పాలకుడు డిజిటల్ సమాజాన్ని బాగా నడిపించగలడు. మంచి విద్యార్థి అంటే కేవలం ఒక సబ్జెక్టులో నిపుణుడు కావడం కాదు, అలాగని అన్ని సబ్జెక్టుల గురించి కొంచెం కొంచెం తెలిసిన సాధారణ వ్యక్తీ కాదు. వేర్వేరు రంగాల జ్ఞానాన్ని కలిపి ఆలోచించగల, సంక్లిష్ట పరిస్థితులకు తగినట్టు మారగల, టెక్నికల్ నైపుణ్యంతోపాటు మానవీయ అవగాహన కూడా ఉన్న వ్యక్తి. చదువు భవిష్యత్తు కేవలం కంప్యూటర్ నాలెడ్జ్‌తోనే నిర్ణయం కాదు. ఏఐ క్షణాల్లో సమాధానాలు ఇచ్చే ఈ కాలంలో, అసలైన సవాలు –ప్రశ్నించగల, చర్చించగల, తెలివైన నిర్ణయాలు తీసుకోగల మనుషులను తయారు చేయడమే. ఇలాంటి సమగ్రమైన చదువు పిల్లల్లో కుతూహలాన్ని, మంచి–చెడు వేరు చేయగల శక్తిని, సృజనాత్మకతను, సామాజిక బాధ్యతను పెంచుతుంది. భారత్ ప్రపంచంలోనే జ్ఞాన కేంద్రంగా ఎదగాలంటే, మన కాలేజీలు కేవలం నైపుణ్యం ఉన్నవారిని కాదు, ఆలోచించే పౌరులను కూడా తయారు చేయాలి. ప్రశ్నించే మనస్తత్వం ఇప్పుడు కేవలం చదువుకు మాత్రమే పరిమితం కాదు, అది కొత్త ఆవిష్కరణలకు, ప్రజాస్వామ్యానికి, మంచి జీవితానికి పునాదిగా మారింది. తల్లిదండ్రులుగా, ఉపాధ్యాయులుగా, సామాజికంగా మనం కూడా పిల్లలకు కేవలం మార్కులు, ర్యాంకుల కోసమే కాకుండా, జీవితంలో ఎదురయ్యే ప్రతి సవాలుకూ ధైర్యంగా, తెలివిగా ఎదురొడ్డి నిలబడే శక్తిని ఇచ్చేలా చదువును తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది!

### పనికొచ్చే పలుకు




## మళ్లీ మొదలుపెట్టడం వైఫల్యం కాదు

ఒక వయసు దాటగానే.. జీవితంలో స్థిరపడిపోవాలని సమాజం అనధికారిక నియమాన్ని రుద్దుతుంది. 30 ఏళ్లు దాటితే కెరీర్ మార్చుకోవడం "రిస్క్", 40కి చేరితే కొత్త స్కిల్ నేర్చుకోవడం "అనవసరం", 50 దాటితే కొత్తగా ఏదైనా ప్రారంభించడం "అసాధ్యం" అన్న భావనను సమాజం బలవంతంగా రుద్దుతుంది. కానీ ఈ ఆలోచనే అతిపెద్ద అపోహ. జీవితాన్ని మళ్లీ మొదలుపెట్టాల్సి రావడం వైఫల్యం కాదు, అది ధైర్యానికి, స్వీయ అవగాహనకు నిదర్శనం. ఈ ఆలోచన వెనుక ఉన్న మనస్తత్వశాస్త్రాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. మనం తరచూ "సంక్ కాస్ట్ ఫాలసీ"కి బలైపోతుంటాం. అంటే, ఇప్పటికే ఒక రంగంలో సంవత్సరాలు వెచ్చించామన్న కారణంతో, అది మనకు నచ్చకున్నా.. మనల్ని సంతోషపెట్టకున్నా.. అందులోనే కొనసాగుతూ ఉండిపోతాం. "ఇన్నేళ్లు కష్టపడ్డాను కదా, ఇప్పుడు మార్చుకుంటే ఆ శ్రమంతా వృథా" అనుకుంటాం. కానీ నిజం చెప్పాలంటే, గతంలో పెట్టిన శ్రమను తిరిగి పొందలేం. భవిష్యత్తులో ఏం చేయాలో మాత్రమే మనం నిర్ణయించుకోగలం. కొత్తగా మొదలుపెట్టడం కాస్త కష్టం అనిపించినా, ఉన్నచోటే ఉండిపోవడం వల్ల జరిగే నష్టమే ఎక్కువ. అసంతృప్తితో గడిపే ప్రతి రోజూ, తిరిగి రాని విలువైన సమయమే.

శాస్త్రీయంగా చూసినా, మెదడు వయసుతో సంబంధం లేకుండా కొత్త విషయాలు నేర్చుకునే సామర్థ్యాన్ని కలిగి ఉంటుందని 'న్యూరోప్లాస్టిసిటీ' అధ్యయనాలు రుజువు చేస్తున్నాయి. 20 ఏళ్లలో ఎంత సులభంగా నేర్చుకోగలమో, 50 ఏళ్లలోనూ అంతే సామర్థ్యంతో నేర్చుకోగలం. తేడా ఏమిటంటే, వయసు పెరిగే కొద్దీ మనం ఎక్కువగా అనుభవాన్ని, జీవిత పాఠాలను తోడుగా తీసుకెళ్తాం. ఇది కొత్త ప్రయత్నాలను మరింత పరిణతితో నిర్వహించడానికి సాయపడుతుంది.

ఇక్కడ ఒక ఆసక్తికరమైన ఆంగ్ల కోట్ ప్రస్తావించదగినది: *It is never too late to be what you might have been.* ఇది సాధారణంగా ప్రఖ్యాత రచయిత్రి జార్జ్ ఎలియట్‌కు ఆపాదిస్తారు, అయితే నిజాయితీగా చెప్పాలంటే –ఈ కోటేషన్ ఆమె రచనల్లో ఎక్కడా కనిపించదని పరిశోధకులు నిర్ధారించారు. ఆమె మరణించిన ఏడాది తర్వాత (1881) ఒక పత్రికలో మొదటిసారి ఇది కనిపించింది, తర్వాత ఆమెకు ఆపాదిస్తూ ప్రాచుర్యం పొందింది. అయితే, ఈ మాటలో ఉన్న సందేశం మాత్రం ఎవరు చెప్పినా అమూల్యమైనదే. మీరు కావాలనుకున్న వ్యక్తిగా మారడానికి ఎప్పుడూ ఆలస్యం కాదు అన్నదే దాని సారాంశం.

మీ నిత్యజీవితంలో ఈ సూత్రాన్ని ఎలా అన్వయించుకోవచ్చో ఆలోచిద్దాం. మొదటిది, "ఇప్పుడు మొదలుపెడితే చాలా ఆలస్యం" అనే ఆలోచనను వదిలేయండి. ఐదేళ్ల తర్వాత మీరు ఎలాగూ ఐదేళ్లు పెద్దవారవుతారు, ఆ సమయాన్ని కొత్త నైపుణ్యంతోనే ఎందుకు గడపకూడదు? రెండోది, పెద్ద మార్పులను చిన్న చిన్న అడుగులుగా విభజించండి. ఒక్కసారిగా మొత్తం జీవితాన్ని తారుమారు చేయాల్సిన అవసరం లేదు, రోజుకు ఒక చిన్న అడుగు చాలు. మూడోది, మీలాంటి మార్పు కోరుకునేవారి సాంగత్యాన్ని పెంచుకోండి. వారి అనుభవాలు మీకు ధైర్యాన్నిస్తాయి.

గుర్తుంచుకోండి – మెరుగైన జీవితాన్ని నిర్మించుకోవడానికి వయసును అడ్డంకిగా చూడకండి. మీ కథ ఇంకా ముగియలేదు, అది ఏ వయసులోనైనా కొత్త అధ్యాయాన్ని మొదలుపెట్టగలదు!

# సీబీఎన్.. 'వన్ సౌత్ వన్ విజన్'!



దక్షిణ భారతదేశాన్ని ఒకే సమగ్ర ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న బృహత్తర ప్రతిపాదనతో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టిని ప్రదర్శించారు. మహాబలిపురంలో ఇటీవల జరిగిన 31వ దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ మండలి సమావేశంలో ఆయన ప్రతిపాదించిన 'వన్ విజన్.. వన్ సౌత్' ప్రణాళిక, 2047నాటికి దక్షిణాదిని 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో రూపొందింది. నదులు కలవాలి, నగరాలు నిలవాలి, ఆర్థిక వ్యవస్థలు బలపడాలన్నదే ఈ ప్రణాళిక సారాంశం. ఒక నది మరో నదితో కలవడం, ఒక నగరం మరో నగరంతో హైస్పీడ్ రైలు ద్వారా అనుసంధానమవడం, ఒక రాష్ట్రంలోని విద్యుత్ మరో రాష్ట్ర పారిశ్రామిక అవసరాలు తీర్చడం, ఒక రాష్ట్ర నైపుణ్య సంస్థ మరో రాష్ట్రంలోని పరిశ్రమలకు మానవ వనరులను అందించడం –ఇవన్నీ విడివిడిగా చేసేవి కావు, ఒకే దారంతో కలిపితేనే 'మెగా విజన్' అనిపించుకుంటాయి. ఈ ప్రతిపాదనల్లో అత్యంత దీర్ఘకాలిక ప్రభావం చూపగల అంశం నదుల అనుసంధానం. దక్షిణ భారతదేశంలో నీటి వనరుల పంపిణీ అసమానంగా ఉందన్నది కాదనలేని వాస్తవం. గోదావరి, మహానది వంటి బేసిన్లలో మిగులు జలాలు ఉండగా, కృష్ణా, పెన్నా, కావేరి, వైగై వంటి బేసిన్లు నీటిలోటును ఎదుర్కొంటున్నాయని జాతీయ జల అభివృద్ధి సంస్థ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో గోదావరి నుంచి కృష్ణా, పెన్నా మీదుగా కావేరి బేసిన్‌కు 500 టీఎంసీకి పైగా మిగులు వరద జలాలు తరలించే ప్రతిపాదనను చంద్రబాబు కేంద్రం ముందుంచారు. అయితే, నదీ అనుసంధానికి అసలు సవాలు ఇంజినీరింగ్ కాదు, అంతర్రాష్ట్ర సమ్మతి, నీటి హక్కులు, ట్రిబ్యునల్ తీర్పులు, పర్యావరణ అనుమతులువంటి సంక్లిష్టతలను పరిష్కరించాలి. అందుకే దక్షిణాది నదీ బేసిన్ల మధ్య ప్రత్యేక సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నది మరో కీలక ప్రతిపాదన. ఒక్కో ప్రాజెక్టును ఒక్కో రాష్ట్ర సమస్యగా కాకుండా, మొత్తం దక్షిణాదిని ఒక జలవనరుల వ్యవస్థగా చూడాలన్నదే ఇందులోని అసలైన సందేశం. వాతావరణ మార్పుల నేపథ్యంలో, భారత్ జనాభా ప్రపంచంలో 18 శాతం ఉన్నా, ప్రపంచ తీపినీటి వనరుల్లో వాటా కేవలం 4 శాతమేనన్న నీతి ఆయోగ్ విశ్లేషణను దృష్టిలో ఉంచుకుంటే, నీటి భద్రతను వచ్చే తరాల మౌలిక వసతిగా చూడాల్సిన అవసరాన్ని ఈ ప్రతిపాదన మరింత బలంగా చాటుతోంది. గంగా–కావేరి అనుసంధానాన్ని జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలన్న మరో విస్తృత ఆలోచనకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా మద్దతు తెలపడం గమనార్హం, అయితే ఇలాంటి భారీ ప్రాజెక్టులను చేపట్టేముందు సమగ్ర పర్యావరణ, సామాజిక అధ్యయనాలు తప్పనిసరి అన్న విషయాన్ని విస్మరించకూడదు.

చంద్రబాబు ప్రతిపాదనల ప్రత్యేకత నీటి అనుసంధానానికే పరిమితం కాలేదు. అమరావతి–బెంగళూరు–చెన్నైలను అనుసంధానించే హైస్పీడ్ రైల్ కారిడార్‌ను కూడా ఆయన ప్రతిపాదించారు. ఇది కేవలం ప్రయాణ సమయాన్ని తగ్గించే రైలు కాదు, పరిపాలన–కొత్త నగర నిర్మాణానికి కేంద్రమైన అమరావతిని, ఐటీ–స్టార్టప్‌లకు ప్రపంచస్థాయి కేంద్రమైన బెంగళూరును, ఆటోమొబైల్–పోర్టు వాణిజ్యానికి కీలక కేంద్రమైన చెన్నైను ఒకే ఆర్థిక కారిడార్‌గా మార్చే బృహత్తర అవకాశం. 2026–27 కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఏడు కొత్త హైస్పీడ్ రైల్ కారిడార్లలో హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నై, చెన్నై–బెంగళూరు మార్గాలు ఇప్పటికే ప్రక్రియలో ఉన్నాయి. వీటినే ఒక సమగ్ర దక్షిణాది కారిడార్‌గా అనుసంధానించే విజన్‌గా చంద్రబాబు ప్రతిపాదనను చూడాలి. దీనికితోడు, చెన్నై, ఎన్నోర్, కృష్ణపట్నం, కాకినాడ, విశాఖపట్నం, కొచ్చి, మంగళూరువంటి పోర్టులను ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌గా అనుసంధానించి, డ్రైపోర్టుల ద్వారా పరిశ్రమలు–రైళ్లు–జాతీయ రహదారులు–అంతర్జాతీయ మార్కెట్లను వేగంగా కలిపే ప్రతిపాదనలో వ్యూహాత్మక ప్రాధాన్యత కనిపిస్తోంది. ఇదే తమిళనాడు ముఖ్యమంత్రి సీ. జోసెఫ్ విజయ్ ప్రతిపాదించిన సమగ్ర ఆర్థిక, లాజిస్టిక్స్ క్లస్టర్ల ఆలోచనతోనూ కలవడం విశేషం.

విద్యుత్ రంగంలోనూ ఇదే సమన్వయ విధానం అవసరమని, ఒక ప్రాంతంలో అధికంగా ఉత్పత్తయ్యే సౌర విద్యుత్‌ను మరో ప్రాంత పారిశ్రామిక డిమాండ్‌కు అనుసంధానించేలా దక్షిణాది గ్రిడ్‌ను జాతీయ గ్రిడ్‌తో మరింత సమర్థంగా కలపాలని చంద్రబాబు ప్రతిపాదించారు. అదేవిధంగా, సెమీకండక్టర్లు, ఏరోస్పేస్, గ్రీన్ ఎనర్జీ, కృత్రిమ మేధ వంటి భవిష్యత్ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించాలంటే, రాష్ట్రాలుగా వేర్వేరుగా కాకుండా ఉమ్మడి నైపుణ్యాభివృద్ధి వ్యవస్థతో ఒక పెద్ద ప్రతిభా మార్కెట్‌గా దక్షిణాది ఎదగాలన్నది ఆయన ఆలోచన. దక్షిణాది ఆధ్యాత్మిక కేంద్రాలైన తిరుపతి, శ్రీశైలం, మదురై, రామేశ్వరాలను వారణాసి, అయోధ్యతో అనుసంధానించే తీర్థయాత్ర సర్క్యూట్ ప్రతిపాదన కూడా, కేవలం ఆధ్యాత్మిక పర్యాటకానికే పరిమితం కాకుండా, హోటళ్లు, రవాణా, హస్తకళలతో కూడిన పూర్తిస్థాయి టూరిజం ఎకానమీని సృష్టించే అవకాశాన్ని చూపుతుంది.

దక్షిణాది రాష్ట్రాలు ఇప్పటికే దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన చోదకశక్తిగా ఉన్నాయి. ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి అధ్యయనం ప్రకారం 2023–24లో దక్షిణాది వాటా భారత జీడీపీలో సుమారు 30.6 శాతం. దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లి, 2047 నాటికి దక్షిణ భారతాన్ని 10 ట్రిలియన్ డాలర్లకుపైగా ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే సామర్థ్యం ఉందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఈ లక్ష్యం సాధించాలంటే ప్రతి రాష్ట్రం విడివిడిగా తన వృద్ధిని పెంచుకుంటే సరిపోదు. ఒక రాష్ట్ర బలం మరో రాష్ట్రానికి మార్కెట్‌గా, సరఫరా గొలుసుగా, మానవ వనరుగా, మౌలిక వసతుల భాగస్వామిగా మారాలన్నదే ఈ మొత్తం ప్రణాళిక వెనుక ఉన్న ఆలోచన. దీన్ని ఒక్క వాక్యంలో చెప్పాలంటే –రాష్ట్రాల మధ్య పోటీని తగ్గించి, పరస్పర ఆధారిత వృద్ధిని పెంచడం. అయితే, ఇలాంటి బృహత్తర ప్రతిపాదనల అసలు పరీక్ష అవి కేవలం ప్రకటనలుగా మిగిలిపోకుండా, వాస్తవ ప్రాజెక్టులుగా మారడంలోనే ఉంది. ప్రతి ప్రతిపాదనకు నిర్దుష్ట కాలపరిమితితో కూడిన డీపీఆర్, స్వతంత్ర శాస్త్రీయ మూల్యాంకనం, రాష్ట్రాల మధ్య పారదర్శక నీటి లెక్కలు, పర్యావరణ రక్షణ, స్థానిక ప్రజల భాగస్వామ్యం వంటివి తప్పనిసరి. చంద్రబాబు ప్రతిపాదనల్లోని అసలైన దూరదృష్టి ఏ ఒక్క ప్రాజెక్టులోనో లేదు. వాటన్నింటినీ ఒకే భవిష్యత్ దక్షిణాది మ్యాప్‌లో చూడటంలోనే ఉంది. గోదావరి నీరు కావేరిని చేరితే అది కేవలం నీటి ప్రయాణం కాదు, ఒక రాష్ట్రపు వనరు మరో రాష్ట్రపు భద్రతకు ఆధారమయ్యే సహకారానికి సంకేతం. అమరావతి నుంచి బెంగళూరు, చెన్నైకి హైస్పీడ్ రైలు పరుగెత్తితే అది మూడు నగరాల ఆర్థిక వ్యవస్థలను ఒకదానితో ఒకటి ముడిపెట్టే ప్రక్రియ. ఈ విజన్ సాకారం కావాలంటే కావాల్సింది కేవలం ప్రకటన కాదు, స్పష్టమైన రోడ్‌మ్యాప్. అదే జరిగితే, గోదావరి నుంచి కావేరి వరకు, అమరావతి నుంచి చెన్నై వరకు, విద్యుత్ గ్రిడ్ నుంచి స్కిల్ గ్రిడ్ వరకు దక్షిణాది భవిష్యత్ అభివృద్ధి కథ ఒకే దిశలో కదిలే అవకాశం మెండుగా కనిపిస్తుంది. చంద్రబాబు ప్రతిపాదనల అసలైన బలం – సరిహద్దులను గుర్తించే పరిపాలన నుంచి, సరిహద్దులను దాటి ఆలోచించే అభివృద్ధి దిశగా వేస్తున్న అడుగులోనే దాగి ఉంది. ■



"చేయాలి" అనే భారంతో కాకుండా, "చేసే అవకాశం నాకే దక్కింది" అనే కృతజ్ఞతతో ప్రతి పనినీ చూడండి. ఈ చిన్న దృక్పథ మార్పే, జీవితంలో ఎన్నో సమస్యలను తేలికపరుస్తుంది. ఇవాళ మనం విసుక్కుంటూ చేసే పనులు - పిల్లలతో గడపడం, తల్లిదండ్రుల బాధ్యతలు, రోజువారీ కష్టాలు - వయసు మీద పడ్డాక వాటినే మళ్లీ ఒక్కసారైనా చేయగలిగితే బాగుండని కోరుకుంటాం. ప్రతి క్షణం విలువైనదే, దాన్ని బరువుగా కాకుండా వరంగా చూడండి.

-మహాదేవ

### వింతల్లో వింతలు

## జనసంద్రంలో ఇసుక తిన్నె



ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే బీచ్ –చైనా షెన్‌జెన్‌లోని దామీషా. కేవలం 1.8 కిలోమీటర్ల పొడవున్న ఇసుక తీరం, వారాంతాల్లో మనుషుల సముద్రమైపోతుంది. వేసవిలో పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందంటే, సముద్రం వరకూ కూడా చేరుకోలేకపోయామని పర్యాటకులు ట్రిప్ అడ్వైజర్‌లో ఆగ్రహం వ్యక్తం చేస్తుంటారు. దీంతో అధికారులు మేనుంచి అక్టోబర్ వరకూ రోజువారీ సందర్శకుల సంఖ్యను 80వేలకు పరిమితం చేస్తూ, తప్పనిసరి రిజర్వేషన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. అయినప్పటికీ, కొన్నిసార్లు ఏకంగా 2 లక్షలమంది వరకూ ఇక్కడ గుమిగూడటం విశేషం. ఈత కొట్టడం మాట అటుంచి, కదలడానికే వీలులేని పరిస్థితి. ఉచిత ప్రవేశం, బీచ్ ఎదురుగానే మెట్రో స్టేషన్ ఉండటం, పలు బస్సు మార్గాలు అందుబాటులో ఉండటం వంటివి జనాదరణకు కారణాలట. ఇలాంటి రద్దీ ఉన్నా, వేసవిలో దామీషా బీచ్ ఫొటోలు తరచూ సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉంటాయి.



## నెదర్లాండ్స్ చేతిలో భారత్ ఓటమి..

పురుషుల హాకీ ప్రపంచకప్-2026లో అమ్‌స్టెల్వీన్ వేదికగా నెదర్లాం-డ్స్‌తో జరిగిన సెకెండ్ రౌండ్ మ్యాచ్‌లో 3-1 తేడాతో భారత్ ఓటమి పాలైంది. దీంతో భారత జట్టు సెమీస్ అవకాశాలు మరింత సంక్లిష్టంగా మారాయి. ఈ కీలక మ్యాచ్‌లో హర్మన్‌ప్రీ-త్ సేన తేలిపోయింది.

ఫస్ట్ హాఫ్‌ల ఇరు జట్ల మధ్య పోరు హోరాహోరీగా సాగింది. భారత డిఫెన్స్ డచ్ జట్టు ఎటాక్‌ను సమర్ధవంతంగా అడ్డుకుంది. దీంతో మొదటి రౌండ్ ముగిసే సరికి ఇరు జట్లు కూడా తమ గోల్ ఖాతాను తెరవలేకపోయాయి. అయితే సెకెండ్ హాఫ్‌లో అయితే నెదర్లాండ్స్ చెలరేగిపోయింది. మ్యాచ్ మూడో క్వార్టర్‌లో డ్యూకో టెల్గె-న్‌క్యాంప్ అద్భుతమైన గోల్‌తో డచ్ జట్టును 1-0 ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. నాలుగో కార్వర్‌టర్‌లో థిజ్స్ వాన్ డామ్ మరో గోల్ సాధించి నెదర్లాండ్స్ ఆధిక్యాన్ని పెంచాడు. ఆ తర్వాత భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్‌ను పవర్ ఫుల్ డ్రాగ్ ఫ్లిక్‌తో గోల్‌గా భారత ఖాతాను తెరిచాడు. కానీ ఆ తర్వాత మరో గోల్‌ను భారత్ సాధించలేకపోయింది. ఇక చివరగా జ్స్ వాన్ డామ్ మరో గోల్ కొట్టి 3-1 తేడాతో నెదర్లాండ్స్ విజయాన్ని ఖాయం చేశాడు. ఈ విజయంతో డచ్ సెమీస్‌కు అర్హత సాధించింది.

ఇక భారత్ సెమీస్‌కు అర్హత సాధించాలంటే అద్భుతాలు జరిగాలి. టీమిండియా తమ చివరి మ్యాచ్‌లో అర్జెంటీనాపై భారీ విజయం సాధించడమే కాకుండా, ఇతర జట్ల మ్యాచ్ ఫలితాలుపై కూడా ఆధారపడాల్సి ఉంటుంది.



## శ్రీలంక జట్టులోకి కొత్త బ్యాటర్

భారత్‌శ్రీలంక మధ్య రెండో టెస్టు ఆదివారం నుంచి కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ (SSC) మైదానం వేదికగా ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో గెలిచి మంచి జోష్‌లో ఉన్న భారత్.. అదే జోరును కొలంబోలోనూ కొనసాగించాలని ఉవ్విళ్లూరుతోంది. మరోవైపు గాలే టెస్టులో ఘోర ఓటమి చవిచూసిన శ్రీలంక తిరిగి పుంజుకోవాలన్న పట్టుదలతో ఉంది. ఈ క్రమంలో ప్రీమ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన లంక కెప్టెన్ ధనంజయ డి సిల్వా కీలక వ్యాఖ్యలు చేశాడు. రెండో టెస్టులో భారత్‌ను అడ్డుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని సిల్వా తెలిపాడు.

"బ్యాటింగ్‌లో భారీ స్కోర్ సాధించి, అనంతరం ప్రత్యర్ధి వికెట్ల తీయడమే మా ప్రధాన వ్యూహం. గాలే టెస్టులో భారత్ కూడా ఇదే చేసింది. తొలి రెండు రోజులూ బ్యాటింగ్ చేసి టీమిండియా 460 పరుగులు సాధించింది. ఈ మ్యాచ్‌లో మేము కూబా బ్యాటింగ్ పరంగా మెరుగ్గా రాణించి, ప్రత్యర్ధి జట్టు 20 వికెట్లు తీసేందుకు ప్రయత్నిస్తాం.

తొలి మ్యాచ్‌లో ఓడిపోవడం నిరాశపరిచినా.. కొలంబోలో మాత్రం తొలి రోజు నుంచే పట్టు సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం. సీనియర్ ఆటగాళ్లు జట్టులో లేనప్పటికి, యంగ్ టాలెంట్ రూపంలో మాకు చాలా అవకాశాలు ఉన్నాయి. ఇద్దరు సీమర్లు, ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగుతున్నాం.

ఈ మ్యాచ్ ద్వారా కామిల్ మిషార టెస్టుల్లో అరంగేట్రం చేయనున్నాడు. గతకొంత కాలంగా అతడు అద్భుతంగా రాణిస్తున్నాడు. ఇటీవల టీ20ల్లో సెంచరీ కూడా చేశాడు. అలాగే లెఫ్ట్ ఆర్మ్ పేసర్ విష్వ ఫెర్నాండోను జట్టులోకి తీసుకునే ఆలోచనలో ఉన్నామని" డిసిల్వా పేర్కొన్నాడు.

## అండర్20 ప్రపంచ రెజ్లింగ్.. సత్తా చాటిన భారత మహిళలు

అండర్20 ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళా రెజ్లర్లు పతకాలతో అదరగొడుతున్నారు. ఈ టోర్నీలో భారత్ ఖాతాలో మరో మూడు పతకాలు చేరాయి. 68 కేజీల విభాగం స్వర్ణ పతక పోరులో చైనాకు చెందిన చెన్‌లింగ్ సాంగ్ చేతిలో 12 స్వల్ప తేడాతో పోరాడి ఓడిన మాన్సి లాథర్ రజత పతకంతో సరిపెట్టుకుంది. 57 కేజీల విభాగంలో తన్వీ మగ్దుమ్ 104 పాయింట్ల తేడాతో అగ్నియా (కెనడా)పై గెలుపొందగా.. 59 కేజీల విభాగంలో కోమల్ 52తో ఎడా బాలాజ్ (హంగేరీ)ని చిత్తుచేసి కాంస్య పతకాలను దక్కించుకున్నారు.

**స్వర్ణం నెగ్గిన కాజల్..**

అంతకుముందు శుక్రవారం జరిగిన 76 కేజీల విభాగం ఫైనల్లో 18 ఏళ్ల కాజల్ దోచాక్ 70తో చైనాకు చెందిన జింగ్రూ సన్‌ను చిత్తుచేసి స్వర్ణ పతకం గెలుచుకుని ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. అలాగే, తను శర్మ (72 కేజీలు), సవిత (62 కేజీలు) ఫైనల్స్ లో జపాన్ రెజ్లర్ల చేతిలో ఓడిపోయి రజత పతకాలకు పరిమితమయ్యారు. టోర్నీ చివరి దశకు చేరుకోగా.. తదుపరి పురుషుల ఫ్రీస్టైల్ 57, 65, 79, 92 కేజీల విభాగాల్లో భారత రెజ్లర్లు పోటీపడనున్నారు.



స్టైలిష్ గ్రే క్రాప్ టాప్ లుక్‌లో ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శిస్తున్న ప్రియాంక ఖోల్గాడే

## ట్రెండ్‌గా మారుతున్న జాంబీ సినిమాలు!





టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు చిత్ర పరిశ్రమలో ఎప్పటికప్పుడు కొత్త జోనర్స్ తెరపైకి వస్తున్నాయి. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచడానికి దర్శకులు విభిన్నమైన కాన్సెప్ట్‌లతో ప్రయోగాలు చేస్తున్నారు. ఆ కోవలోనే కొన్ని సంవత్సరాల క్రితం టాలీవుడ్‌లో ప్రశాంత్ వర్మ అద్భుతమైన సృజనాత్మకతతో తెరకెక్కించిన -జాంబీ రెడ్డి- సినిమాతో హర్రర్-కామెడీ జాంబీ కాన్సెప్ట్ అధికారికంగా పరిచయమైంది. తెలుగు ప్రేక్షకులకు పూర్తిగా కొత్తనైన జానర్‌ను దర్శకుడు అత్యంత వినోదాత్మకంగా మలచడంతో ఈ ప్రయోగం బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించింది. -జాంబీ రెడ్డి- సృష్టించిన ట్రెండ్ ఒక చిత్రంతో ఆగిపోకుండా ఇండియన్ స్క్రీన్ మీద సరికొత్త ట్రెండ్‌గా వేగంగా మారుతోంది. భయంతో పాటు కడుపుబ్బా నవించే కామెడీని మిక్స్ చేసి తెరకెక్కించే జాంబీ జోనర్‌పై నేటి యువ ప్రేక్షకులు మంచి ఆసక్తి చూపిస్తున్నారు. హాలీవుడ్ సినిమాలకు మాత్రమే పరిమితం అనుకున్న జాంబీ కాన్సెప్ట్‌ను భారతీయ నైటివిటీకి తగ్గట్టుగా మార్చి తెరపై ఆవిష్కరిస్తుండటంతో మేకర్స్‌కు కూడా కొత్త అవకాశాలు కలుగుతున్నాయి. ఈ విజయవంతమైన బాటలోనే ఇప్పుడు మరిన్ని భారీ ప్రాజెక్ట్‌లు ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమ వుతున్నాయి. -జాంబీ రెడ్డి- చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న -జాంబీ రెడ్డి 2-పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా.. ఈసారి మరింత విస్తృతమైన గ్రాఫిక్స్ .. వినోదంతో సినిమాను తెరకెక్కిస్తున్నారు. మొదటి భాగం కంటే రెండవ భాగం మరింత వైవిధ్యంగా ఉంటుందని ప్రేక్షకులను సీట్లలో కూర్చోబెట్టేలా అదిరిపోయే హర్రర్-కామెడీ ఎలిమెంట్స్ ఇందులో ఉంటాయని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తుంది. ఇక బాలీవుడ్‌లోనూ జాంబీ జోనర్ జోరు భారీగా పెరిగింది. స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం -ప్రళయ్- కూడా ఇదే కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. భారీ బడ్జెట్‌తో హాలీవుడ్ స్థాయి టెక్నికల్ వాల్యూస్‌తో తెరకెక్కుతున్న చిత్రం బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టించేందుకు రంగం సిద్ధం చేసుకుంటోంది. రణ్‌వీర్ సింగ్ లాంటి స్టార్ హీరో ఈ జోనర్‌లో నటిస్తుండటంతో సినిమాపై జాతీయ స్థాయిలో భారీ హైప్ క్రియేట్ అవుతుంది. మరోవైపు కోలీవుడ్‌లోనూ ఈ ట్రెండ్ జోరుగా కొనసాగుతోంది. ప్రభుదేవా .. నవ్వుల రారాజు వడివేలు ప్రధాన తారాగణంగా తెరకెక్కుతున్న -బ్యాంగ్ బ్యాంగ్- సినిమా కూడా జాంబీ కామెడీ నేపథ్యంలోనే రూపొందుతోంది. ఇద్దరి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న హర్రర్-కామెడీ ఎంటర్‌టైనర్ ప్రేక్షకులకు అంతులేని నవ్వులను పంచడం ఖాయమని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఒకరికొకరు పూర్తిగా భిన్నమైన శైలి కలిగిన ఇద్దరు దిగ్గజాలు జాంబీలతో చేసే అల్లరి థియేటర్లలో నవ్వుల పువ్వులు పూయించడం పక్కా. మొత్తంగా ప్రశాంత్ వర్మ విత్తిన జాంబీ రెడ్డి చిన్న మొక్క నేడు ఇండియన్ సినిమా పరిశ్రమలో పెద్ద వృక్షలా ఎదిగుతోందన్నది కాదనలేని నిజం. రొటీన్ లవ్‌స్టోరీలు, యాక్షన్ చిత్రాలకే పరిమితం కాకుండా ఇలాంటి ప్రయోగాత్మక జాంబీ కాన్సెప్ట్‌లను ప్రేక్షకులు ఆదరిస్తుండటం శుభపరిణామం. రాబోయే రోజుల్లో భారతీయ తెరపై జాంబీ సినిమాల జోరు మరింత పెరిగి మరిన్ని అద్భుతమైన చిత్రాలు వచ్చే అవకాశం ఉంది.



సాంప్రదాయక రూపంలో శ్రియా శరణ్ కాలాతీతమైన హుందాతనాన్ని ప్రదర్శిస్తున్నారు

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com